RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

https://netimanadesam.com/

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 56 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి బుధవారం 25-2-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥ నవమి రా॥ 2.57, రోహిణి మ ॥2.09, వర్జ్యం ఉ॥6.44 -8.13, దుర్ముహూర్తం ఉ॥11.51-12.37, శుభ సమయం ఉ॥ 10.30-12.00, రాహుకాలం మ॥12.00-1.30, సూర్యోదయం ఉ॥ 6.34, సూర్యాస్తమయం సా॥ 5.55 గం॥

## గుంటూరు ఛానల్ ఆధునీకరణకు రూ.369 కోట్లు

-ప్రభుత్వ పరిశీలనలో అంచనాలు

-మండలిలో ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం 2లో


# కల్తీ నెయ్యితో రూ.20 కోట్ల లడ్డూల తయారీ

**-2019-24 మధ్య 59.71 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగం -రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ**

**-ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కల్తీ జరిగిందని చెప్పా -అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారు**

**-కల్తీపై దేవుడే తనతో విషయాలు వెల్లడించేలా చేశారు -అసెంబ్లీలో సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారు. 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడని చంద్రబాబు అన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు



చూశామని సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రిపోర్ట్ వివరాలు వెల్లడించానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71 లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ.234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళ్లుగప్పి నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019-24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి మిగతా 2లో..

# కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే!

**ఆనాటి బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు**

**రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని రుజువయ్యింది**

**అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. కల్తీనెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలి. జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది. అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చింది. ఇది ధర్మానికి సంబంధించిన విషయం. సకల మతాలను గౌరవించడం ఈ దేశ సంస్కృతి. తితిదే పాత బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే ఆయనకూ భాగం ఉన్నట్టే కదా?' అని పవన్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత తప్పుచేశారని



తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది.. వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు మిగతా 2లో..

## కొండప్రాంతాల్లో రహదారులకు అడవితల్లి బాట

**- రూ.1,077 కోట్లతో కార్యక్రమం అమలు**

**-అసెంబ్లీలో ప్రశ్నకు మంత్రి నాదెండ్ల సమాధానం**

**అమరావతి,ఫిబ్రవరి24 (ఆర్ఎన్ఎ):** గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం చేపట్టినట్లు అసెంబ్లీలో మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలవుతోందని.. దీని ద్వారా సుమారు 4 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరుగుతోందని మంత్రి వివరించారు. అసెంబ్లీ సమావేశాలు తొమ్మిదో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ 'అడవితల్లి బాట' కార్యక్రమంపై ప్రశ్న లేవనెత్తారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సభలో లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం



ఇచ్చారు. మన్యం ప్రాంతంలో సరైన రోడ్లు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారని మంత్రి అన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం డోలీల ద్వారా రోగులను తరలించాల్సి వచ్చేదని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారని నాదెండ్ల మనోహర్ వివరించారు. అలాగే ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రామాల సమస్యను కొణతాల రామకృష్ణ సభలో ప్రస్తావించారు. ఈ గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. అయితే.. ఏపీ అధికారులు అక్కడికి వెళ్లకుండా ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం జోక్యం చేసుకుని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

## పశు వైద్యశాల ఆధునీకరణకు చర్యలు

**-అవసరమైన ఉపకరణాల సరఫరా**

**-అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** పశు వైద్యశాలల్లో సౌకర్యాలు, ఉపకరణాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఉచితంగా మందుల సరఫరా చేస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమైన శాఖలకు తాళాలు వేశారని.. అన్ని శాఖల్లో నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇబ్బందులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. వెటర్నరీ ఆసుపత్రుల భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. 2014-19 మధ్య కాలంలో నాబార్డ్ నిధులతో 326 భవనాలు మంజూరు చేశామని.. వాటిలో కొన్ని భవనాల నిర్మాణాలను అప్పట్లో పూర్తి చేశామని గుర్తుచేశారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్త భవనాల నిర్మాణం నిలిపేసిందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో భవనాల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు.

## మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గుదల

**-20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయి**

**-ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదు**

**-మండలిలో చర్చ సందర్భంగా హోంమంత్రి అనిత వెల్లడి**

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని, ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా హోం మంత్రి అనిత



మాట్లాడారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యల వల్లే 20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయని, పోక్సో కేసులు 8 శాతం, మహిళలపై హత్యలు 45శాతం, సామూహిక అత్యాచారాలు 64 శాతం తగ్గాయని తెలిపారు. గతంలో కేసులు నమోదు కాలేదని, కానీ తాము ప్రతి కేసును నమోదు చేయడంతో నేరాల సంఖ్య తెలుస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలు లేవు కాబట్టే పెట్టుబడులు, పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, బయటకు వచ్చిన మహిళ తిరిగి ఇంటికి వెళ్తుందో లేదో తెలియని దుస్థితి ఉండేదని అనిత విమర్శించారు. గత ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ ఆక్షన్ మిగతా 2లో..

## నెయ్యి సేకరణలో 2020లో నిబంధనలు మార్పు

**-కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పిఎస్‌లో కేసు**

**-అసెంబ్లీలో కల్తీ లడ్డూ కేసు వివరాలు వెల్లడించిన ఆనం**

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం సీనియర్ అధికారులతో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటైందని చెప్పారు. ఆ తర్వాత సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్‌ను పునర్



వ్యవస్థీకరించినట్లు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో మంత్రి మాట్లాడారు. 2014నుంచి ఈ-టెండర్ల ద్వారా అగ్‌మార్క్ స్పెషల్ ఆవు నెయ్యిని తితిదే సేకరిస్తోంది. కమిటీ సిఫార్సుల ఆధారంగా 2019లో టెండర్ నిబంధనలను బలోపేతం చేశారు. ఆ తర్వాత 2020లో సేకరణ నిబంధనలను మార్చారు. 5 నెలల వ్యవధిలోనే వాటిని సవరించినట్లు తేలింది. నిర్వహణ అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి ఏడాదికి.. వార్షిక టర్నోవర్ అవసరాన్ని తగ్గించారు. ఆవు పాల కొవ్వు ఉత్పత్తి ప్రమాణాలను తగ్గించారు. తప్పనిసరి పాల సేకరణ నిబంధనను తొలగించారు. సమగ్ర అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా సడలింపు చేశారని తెలిపారు.

## ఎంతకాలం ఉంటానో తెలియదు!

**అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు**

**నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు**

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య**

**వాషింగ్టన్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** 'నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు



ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల మిగతా 2లో..

## హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల ఆపరేషన్

**-16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్**

**హైదరాబాద్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల్లో బ్యాంకు అధికారులు కూడా ఉన్నారు. 32 బృందాలతో 16 రాష్ట్రాల్లో 10 రోజుల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. నిందితులపై దేశవ్యాప్తంగా 1,055 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు వీరు పలు సైబర్ నేరాల్లో రూ.127 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. వారి నుంచి రూ.36 లక్షల నగదుతో పాటు 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్‌కార్డులు, 152 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 234 డెబిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

## మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

**-డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు -లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న**

**-40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు -వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి**

**-కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి**

**హైదరాబాద్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11



మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మిగతా 2లో..

## కల్తీపాల ఘటనలో వ్యాపారి గణేశ్‌పై కేసు

**-పాలల్లో యూరియా, డిటర్జెంట్ పౌడర్ గుర్తింపు**

**-విచారణాధికారి వెల్లడి**

**రాజమండ్రి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** రాజమండ్రి కల్తీ పాల ఘటనపై విచారణ అధికారి కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విచారణ చేపట్టారు. పాల వ్యాపారి అడ్డాల గణెళిష్ నిర్వహిస్తున్న వరలక్ష్మి డెయిరీని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ దేవకుమార్ మాట్లాడుతూ.. పాల వ్యాపారి గణేశ్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిపై వివిధ సెక్షన్లు నమోదు చేశామని వెల్లడించారు. పాల వ్యాపారి గణెళిష్ వరలక్ష్మి మిల్క్ డెయిరీని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నాడని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, లాభాపేక్షతో పాలల్లో నీళ్లు కలిపి ప్రజలకు పోసేవాడని చెప్పారు. ఈ నెల 14న పాలు తక్కువగా సేకరించడం వల్ల పాలు చిక్కగా కనిపించేందుకు యూరియా, డిటర్జెంట్ పొడి, నూనె వంటి పదార్థాలు కలిపి కల్తీ చేశాడన్నారు. కల్తీ చేసిన పాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయడం వల్ల కూలెంట్ మిగతా 2లో..

దుర్బలులమని ప్రకటించుకోవటం చేత మనం దుర్బలులమే అవుతాం; ప్రయోజకులం కాము. ఏకాగ్రత పెంపొందేకొద్దీ ఎక్కువ విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఎందుకంటే ఏకాగ్రతే జ్ఞాన సముపార్జనకు మార్గం.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ప్రజల పాలిట పాలకూట విషం

కల్తీకి కాదేదీ అర్హం అన్న రీతిలో... ఆహారా పదార్థాల కల్తీ విపరీతం అయ్యింది. అడపాదడపా దాడుల్లో కల్తీలు బయటపడుతున్నా కఠిన చర్యలు కనిపించడం లేదు. కల్తీ చేస్తున్న దగుల్బాజీల్లో భయం కనిపించడం లేదు. కల్తీ కల్లుకు బలవుతున్నారు. కల్తీ మద్యానికి బలవుతున్నారు. ఫుడ్ పాయిజనింగ్‌కు బలవుతున్నారు. చివరకు పాలు కూడా కల్తీ చేస్తున్నారు. యూరియా లాంటివి కలిపి కృత్రిమ పాలతో ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారు. నిత్యం తాగే పాలను సైతంకల్తీ చేస్తున్న ఘటన వెలుగులోకి రావడం దారుణం. కల్తీ పాల కారణంగా ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు మరణించడం బాధాకరం. స్వచ్ఛతకు మారుపేరుగా పాలను పేర్కొంటారు. అటువంటి పాలను అమితమైన లాభార్జన కోసం కాలకూట విషం కావించడం అమానవీయం. ఒకప్పుడు పాలల్లో నీళ్లు కలపడాన్ని పెద్ద నేరంగా పరిగణించేవారు. ఇప్పుడు పాలంటే హడలెత్తే స్థితికి కల్తీ దందా చేరుకోవడం ఆందోళన కలిగిస్తుంది. పాలు ప్రజలకు నిత్యావసర వస్తువు. పసికందుల దగ్గర నుంచి వృద్ధుల వరకు పాలే జీవనాధారం. పాలు తాగితే చాలా వరకు మన శరీరానికి కావాల్సిన సంపూర్ణ పోషకాలు సమకూరుతాయన్నది ఆరోగ్య నిపుణుల మాట. అటువంటి పాల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ అంతంత మాత్రమే. ఎవరైనా డెయిరీ పెట్టవచ్చు. పాలు సరఫరా చేయవచ్చు. అందులో ఏం కలుస్తున్నాయో తెలియడం లేదు. నేరుగా గేదె పాలు పోస్తున్నారన్న నమ్మకంతో ప్రజలు డబ్బాల్లో వచ్చే పాలను ఆశ్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడ్రస్ లేకుండా పోయారు. వాటిపై పర్యవేక్షణ ఎవరిదన్న విషయం తెలియదు. కాలం చెల్లిన, నాసిరకం, కల్తీ పాలను గుర్తించే వ్యవస్థ అసలు ఉందా అన్నదే అనుమానం. గతంలో రైతులు తమకు తాముగా నిర్వహించుకునే సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు పాల కల్తీ ఉండేది కాదు. ఎప్పుడైతే ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుల్లా పుట్టుకొచ్చాయో అప్పటి నుంచి కల్తీ విచ్చలవిడైందన్న ఆరోపణలు బాగా ముందుకొచ్చాయి. పాడి–పంట.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుతో విడదీయరాని బంధం. గ్రామీణ మహిళలే పాడిని నిర్వహిస్తారు. కానీ కష్టపడి పాలను ఉత్పత్తి చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. వారి వద్ద నుంచి పాలను సేకరించిన ప్రైవేటు డెయిరీలకు మాత్రం లాభాల పంట పండుతుంది. రోజూ ఉత్పత్తవుతున్న పాలల్లో ప్రైవేటు, సహకారం రెండూ కలిపినా కూడా సంఘటితరంగం కిందికొచ్చేవి సగం కూడా లేదన్నది ప్రభుత్వ అంచనా. ప్రభుత్వం దశలవారీగా సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ప్రైవేటు ఆధిపత్యం అంతకంత కూ పెరుగుతోంది. డెయిరీల మధ్య అనారోగ్య పోటీ నెలకొంది. డెయిరీ ప్రైవేటీకరణ కాస్తా కార్పొరేటీకరణ బాట పట్టింది. ఎప్పుడైతే పరిస్థితి మారిందో చిన్నా చితకా డెయిరీలు సైతం లాభాల కోసం అడ్డదారులు తొక్కుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. రాష్ట్రంలో పాడిపశువుల సంఖ్యపై అనుమానా లున్నాయి. ప్రజల ఆరోగ్యాలను హరించే సింథటిక్ పాలు, యూరియా వంటి రసాయనాలతో తయారు చేసిన పాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయన్న ఫిర్యాదులొస్తున్నాయి. పాల వ్యాపారులు ఏకంగా కృత్రిమ పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కనిపిస్తుంది. దీనికితోడు తనిఖీ బాధ్యతను ఆయా సంస్థలకే వదిలేసినట్లు కనిపిస్తుంది. పాలతో సహా యావత్ ఫుడ్ సేఫ్టీ బాధ్యత ప్రభుత్వానిదే అయినా ఎక్కడా అజమాయిషీ కనిపించడం లేదు. . అందుకు పటిష్టమైన వ్యవస్థ అవసరం. లేదంటే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందనడానికి రాజయమండ్రి ఘటనే నిదర్శనం. రాజమహేంద్రవరం కేసులకు సంబంధించిన ఇప్పటికీ ఇద్దరు వెంటిలేటర్‌పై ఉండగా, 8 మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒకే వ్యక్తి నుంచి పాలు కొనుగోలు చేసిన వారిలో ఈ వ్యాధి ముదరి ఆస్పత్రి పాలయ్యారు. అనూరియా అంటే మూత్ర విసర్జన ఆగిపోవడం వంటి జబ్బుతో పలువురు ఆస్పత్రిలో చేరారు. రాజమండ్రి నగర శివారుకు చెందిన డజను మంది అనూరియా లక్షణాలతో ఆదివారం ఒకేసారి ఆస్పత్రులల్లో చేరడంతో కలకలం లేచింది. పరిస్థితి డయాలసిస్, కిడ్నీల ఫెయిల్యూర్ వరకు వెళ్లడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అనారోగ్యం పాలైన వారు వృద్ధులు, చిన్నారులే కావడం పెద్ద విషాదం. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కారణాలను అన్వేషించే పనిలో పడింది. కోరుకొండ మండలం పర్సాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి డెయిరీ నుంచి సరఫరా అయిన కల్తీ పాలే పలువురి అస్వస్థతకు మూలమని ప్రాథమికంగా గుర్తించారు. డెయిరీ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కూపీ లాగుతున్నారు. కల్తీ పాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించడంతో పాటు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తానని పేర్కొంది. ఈ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన మండలిలో హోం మంత్రి అనిత ప్రకటనలు చేశారు. దీనిని ఇంతటితోనే విదిలేస్తే సరిపోదు. పాల సరఫరాచేస్తున్న వారిపై నిఘా పెట్టాలి. కల్తీ పాల వ్యవహారాన్ని గుర్తించాలి. నిజానికి పాడిగేదెలు ఎన్ని ఉన్నాయి.. ఎక్కడెక్కడ నుంచి పాలు వస్తున్నాయో వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చేస్తే మంచిది. పాల కల్తీ జనాన్ని కలవర పరుస్తోంది. కాసుల కక్కుర్తితో కొందరు ఈ పాపానికి ఒడిగడుతున్నారు. అనుమతి లేని కేంద్రాలను నడుపుతూ జనం ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పటిష్ఠ తనిఖీలు, కఠిన శిక్షలు లేకపోవడంతో పాల కల్తీకి అడ్డుకట్ట పడడం లేదు. జిల్లాల్లో అవసరాలకు, ఉత్పత్తికి భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్యాకేజ్డ్ పాల ద్వారా కొంత అవసరాలు తీరుతుండగా.. మిగతా పాలు ఎక్కడివనే తీవ్ర అనుమానాలు రేకెత్తుతున్నాయి. వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కొందరు కాసుల కక్కుర్తితో కల్తీకి పాల్పడుతున్నారు. రెండు లీటర్ల పాలల్లో యూరియా, బియ్యం పిండి, సోడా వంటివి కలిపి 5 నుంచి 6 లీటర్లుగా తయారు చేస్తున్నారు. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లపై నిషేధమున్నా.. పాల దిగుబడి పెంపునకు రహస్యంగా తెచ్చి గేదెలకు ఇస్తున్నారు. గ్లూకోజ్, సోడియం, హైడ్రాక్సైడ్, గంజి పొడరు, జంతువుల కొవ్వు కొన్ని రకాల పాల పొడులను పాలలో కలిపేస్తున్నారు. రసాయనాలతో వ్యాధుల ముప్పు: కల్తీ పాలతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. చిక్కదనం కోసం వాడే యూరియా మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. నిల్వ కోసం కలిపే వాడే ఫార్మలిన్ అనే రసాయనంతో జీర్ణకోశ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. రసాయనాలతో ఉదర, కాలేయ సంబంధిత సమస్యలొస్తాయి. రాజమండ్రిలో మాత్రమే ఇప్పుడు బయటపడ్డది. ప్రభుత్వం మేలుకోకుంటే మరిన్ని ఘటనలు రావచ్చు.

# గుంటూరు ఛానల్ ఆధునీకరణకు రూ.369 కోట్లు

### ప్రభుత్వ పరిశీలనలో అంచనాలు -మండలిలో ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారని నీటిపారుదల శృాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ అంచనాల అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.370 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. అయితే.. 2021లో ఆ నిధులను రద్దుచేస్తూ కొత్త అంచనాలు రూపొందించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.369 కోట్లతో పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణపై ఏపీ శాసనమండలిలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రశ్న లేవనెత్తారు. గుంటూరు ఛానల్ సంబంధిత కట్టలు దెబ్బతిన్నాయని తెలిపారు. మంగళగిరి పట్టణం నుంచి మురుగు నీరంతా ఈ ఛానల్‌లో కలుస్తోందని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ ఛానల్ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమంతరావు ప్రశ్నపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానిమస్తూ.. ఛానల్ పొడిగింపునకు రూ.285 కోట్లు విడుదల చేశామని మంత్రి నిమ్మల వెల్లడించారు. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు ఛానల్‌లో మురుగు కలవకుండా చూడాలని, దీనిపై మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆలపాటి రాజా కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. మొదటి దశ కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుచేయాలని నిర్ణయించామని తెలిపారు.

# అధికారం అడ్డంపెట్టుకుని దోపిడీ

### నెయ్యి నిబంధనలు మార్చిందెవరు -అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత కంపెనీలకు దోచిపెట్టారని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. తిరుమల నెయ్యి సేకరణకు సంబంధించిన కఠిన నిబంధనలను మార్చిందెవరని ఆయన ప్రశ్నించారు. రోజుకు 4 లక్షల లీటర్ల సామర్థ్యం నిబంధనను తీసేశారని.. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తీసుకొచ్చారని చెప్పారు. డెయిరీ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి తీసుకొచ్చారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ధూళిపాళ్ల మాట్లాడారు. నిబంధనలు సడలింపు చేయడంతో తమకు కావాల్సిన ప్రైవేటు వ్యాపారులకు టెండర్లు ఇచ్చేందుకు పునాది పడింది. ఒక మహాపాపం, దోపిడీకి ఆనాడే తెరలేపారు. కల్తీ నెయ్యిని ఏటా సరఫరా చేశారు. నాటి ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం లేకపోతే తిరుమలలో ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా సాగుతుందా? వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు?‘ అని ఆయన ప్రశ్నించారు.

# అధికారం అడ్డంపెట్టుకుని దోపిడీ

### నెయ్యి నిబంధనలు మార్చిందెవరు -అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత కంపెనీలకు దోచిపెట్టారని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. తిరుమల నెయ్యి సేకరణకు సంబంధించిన కఠిన నిబంధనలను మార్చిందెవరని ఆయన ప్రశ్నించారు. రోజుకు 4 లక్షల లీటర్ల సామర్థ్యం నిబంధనను తీసేశారని.. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తీసుకొచ్చారని చెప్పారు. డెయిరీ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి తీసుకొచ్చారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ధూళిపాళ్ల మాట్లాడారు. నిబంధనలు సడలింపు చేయడంతో తమకు కావాల్సిన ప్రైవేటు వ్యాపారులకు టెండర్లు ఇచ్చేందుకు పునాది పడింది. ఒక మహాపాపం, దోపిడీకి ఆనాడే తెరలేపారు. కల్తీ నెయ్యిని ఏటా సరఫరా చేశారు. నాటి ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం లేకపోతే తిరుమలలో ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా సాగుతుందా? వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు?‘ అని ఆయన ప్రశ్నించారు.

# జిల్లా కలెక్టర్‌చే అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ



**కడప, ఫిబ్రవరి 24: (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 2026–27 సంవత్స రానికి గాను జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి చే అక్రిడిటేషన్ కార్డులు డి ఎం ఎ సి కమిటీ సభ్యులకు,స్టాపర్లకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదు గా అందజేశారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మొదటి సమావేశంలో ఆమోదం పొందిన 541 మంది పాత్రికేయులకు అక్రిడిటేషన్ లు జారీ చేయడం జరిగింది.అక్రిడిటేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న మిగిలిన పాత్రికేయులకు కూడా వారి అర్హత మేరకు తదుపరి సమావేశం లో మంజూరు చేయడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు.మొదటి జాబితాలో ఆమోదం పొందిన పాత్రికేయులందరూ బస్సు సౌక ర్యాన్ని పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఎసి కమిటీ సభ్యులు రామ సుబ్బారెడ్డి,నూర్ భాషా, మనో హర్,సందీప్ కుమార్ రెడ్డి,మురళి మోహన్ గౌడ్, శ్రీకాం త్, శ్రీనాథ్ రెడ్డి,స్టాపర్లు, పాత్రికే యులు పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాలల సమస్యలపై తక్షణ స్పందన

### -మంత్రి లోకేశ్‌ను అభినందించిన హైకోర్టు

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనితీరును హైకోర్టు ప్రశంసించింది. కస్తూర్బా పాఠశాలల సమస్యలపై మంత్రి వేగంగా స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని ధర్మాసనం పేర్కొంది. సుమోటో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి చురుగ్గా వ్యవహరిస్తున్నారని కోర్టు ప్రశంసించింది. ధర్మాసనం ముందు విచారణ సందర్భంగా మంత్రి లోకేష్ ఇటీవల చేసిన ప్రకటనలను కోర్టు ప్రస్తావించింది. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు(కేజీబీవీ)లో పని చేస్తున్న టీచర్ల జీతాలను పెంచడం, ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ప్రకటించడం సానుకూల చర్యగా అభివర్ణించింది. విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి చురుగ్గా వ్యవహరిస్తున్నారని కోర్టు ప్రశంసించింది. ఇటీవల కస్తూర్బా వసతి గృహంలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై మంత్రి తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన విషయాన్ని కూడా ధర్మాసనం గుర్తు చేసింది. విద్యార్థుల భద్రత, సంక్షేమంపై మంత్రి చూపిన చొరవను కోర్టు అభినందించింది. అయితే మంత్రి ఆ స్థాయిలో పనిచేస్తుంటే అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. విద్యార్థుల భద్రత, పాఠశాలల నిర్వహణపై ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

# మృతి చెందిన సభ్యులకు అసెంబ్లీ సంతాపం

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** మంగళవారం శాసనసభలో పలువురు దివంగత నేతలకకు నివాళి అర్పించారు. ఇటీవల మరణించిన పలువురు మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం తెలియజేసింది. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి, విజయవాడ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే ఆసిఫ్ పాషా, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటె సుమన్, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండు అప్పల సూర్యనారాయణ, తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే రత్నాబాయి మృతి పట్ల సభ సంతాపం తెలిపింది. ప్రజా జీవితంలో వారు చేసిన సేవలను సభకు వివరించారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. మాజీ శాసనసభ్యుల మృతికి గౌరవసూచకంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

# పోలవరం ప్రాంతంలో మరోమారు పులికలకలం

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన అటవీ అధికారులు

**రాజమండ్రి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** పోలవరం జిల్లాలో మరోసారి పులి సంచారం కలకలం రేపుతోంది. రంపచోడవరం మండలం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇదే పులి సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ పులిని అటవీ అధికారులు ఎంతో చాకచక్యంగా బంధించి విశాఖపట్నం జూకు తరలించారు. అక్కడ చికిత్స అందించిన తర్వాత, ప్రత్యేక కమిటీ నిర్ణయం మేరకు పాపికొండలు అభయారణ్యంలో వదిలిపెట్టి.. ఆ వీడియోలను మీడియాకు విడుదల చేశారు. అయితే, ఇదే పులి గత రెండు రోజులుగా మారేడుమిల్లి మండలం అటవీ ప్రాంతంలో కనిపించింది. కాకవాడ, దారగూడెం, నూరుపూడి, సీమగండి, రామన్నవలస, తుర్రూరు, దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల సరిహద్దుల్లో సంచరించినట్లు సమాచారం. ప్రస్తుతం రంపచోడవరం మండలంలోని గెద్దాడ, చిలకమామిడి, బూసిగూడెం అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్నట్టు అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులి సంచారంతో అటవీశాఖ నిఘా పెంచింది. పులి కదలికలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని అటవీ అధికారులు హెచ్చరించారు.

# పర్యాటకంగా విశాఖలో పలు అభివృద్ధి పనులు

### రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు -అసెంబ్లీలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖ నగరం కీర్తి కిరీటంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఎంవోయూ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో విశాఖను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఏయు–ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలీ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. విశాఖను అడ్వెంచర్, యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం దేవస్థానానికి రూ.54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ.28.87 కోట్లు మంజూరు చేసి పనులు వేగవంతం చేశామని వివరించారు. రుషికొండ, తిమ్మాపురం, సాగర్ నగర్ బీచ్, గోస్తనీ బ్యాక్ వాటర్స్‌లో స్కూబా డైవింగ్, పారా మోటరింగ్ వంటి 10 రకాల జలక్రీడలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో మరింత ఊతం వచ్చిందని మంత్రి అన్నారు. క్యారవాన్ పాలసీలో భాగంగా అన్ని ప్రాంతాల్లో క్యారవాన్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విశాఖలో 'హాప్–ఆన్, హాప్–ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులు' సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. హోమ్ స్టే పాలసీ, బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానంతో 490 హోమ్ స్టేలు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. 'సీఆర్‌జెడ్ 19' అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయన్నారు. 2019–24 కాలంలో కుదేలైన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించిందని ఆయన వివరించారు. నూతన పర్యాటక పాలసీ 2024–29తో విస్తృతంగా పెట్టుబడులు వచ్చాయన్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు.

## మొదటి పేజీ తరువాయి

# కల్తీ నెయ్యితో రూ.20 కోట్ల లడ్డూల తయారీ

పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. 2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసాయనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టారన్నారు. 2024 జులై 23న రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు. జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు. 2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా ప్లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు ఛైర్మన్ పీఏ చిన్నఅప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ ఛైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోపణలు వచ్చాయని గర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. నాటి టీటీడీ ఛైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు వివరించారు.

# కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే!

కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు. రూ.20 కోట్ల లడ్డూలు రసాయనాల నెయ్యితో తయారైనట్టు తేలిందని, రసాయనాలతో తయారైన లక్ష లడ్డూలను అయోధ్యకు పంపారని ఈ సందర్భంగా పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో దోషులెవరైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారాయన. ఆ నెయ్యిలో.. ఏ రసాయనాలు ఉన్నాయో శ్రీవారికే తెలియాలన్నారు డిప్యూటీ సీఎం. నెయ్యిలో జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అది అసలు నెయ్యే కాదని సీబీఐ సిట్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఇది స్వామివారికి కాకుండా ఇతర ఏ మతానికి జరిగినా దేశం గగ్గోలు పెట్టేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గుదల

ఇవ్వకపోవడం వల్ల రూ. 180 కోట్ల కేంద్ర నిధులు కోల్పోయామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే ఇంట్లో దొంగతనం కేసులో వైసీపీ గ్రామ సర్పంచ్ అరెస్టయ్యారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాల కోసం వాడకోవడం లేదని, అందువల్లే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 25 శాతం తగ్గాయని అనిత పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు 96,940 కేజీల గంజాయి సీజ్ చేశామని తెలిపారు. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబోలేటరీ భవన నిర్మాణాన్ని జగన్ ఆపేశారని, తాము ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రప్పా.. రప్పా.. నరుకుతాం’ అని శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడితే కేసు ్ ÷ల్ చేశామని, వైసీపీ కార్యకర్తలు అసభ్యంగా మాట్లాడితే దాన్ని జగన్ సమర్థించడం దారుణమని అన్నారు. గీత దాటి రెచ్చ గొడుతూ మాట్లాడినా చూస్తూ ఊరుకునేందుకు ఇక్కడ సీఎంగా ఉన్నది జగన్ కాదని, చంద్రబాబు అని అనిత పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన ఆరాచకాల ఫలితంగానే వారు 151 నుంచి 11 సీట్లకు దిగజారారని విమర్శించారు.

# ఎంతకాలం ఉంటానో తెలియదు!

నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్–ఎ–లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండు సార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది. తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984–89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010–16 మధ్య ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999–2000లో ఏటూరునాగారం–మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహ రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

# కల్తీపాల ఘటనలో వ్యాపారి గణేశ్‌పై కేసు

ఆయిల్ లీకై పాలు కలుషితమయ్యాయని తెలిపారు. అందువల్లే పాలు చేదుగా ఉన్నాయన్నారు. కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఆదివారం వరకు ఇద్దరు మృతి చెందగా.. సోమవారం మరో ముగ్గురు చనిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణమూర్తి, ఎన్ శేషగిరిరావు, తాడి రమణి మృతి చెందారు. మరికొంతమంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీర పాండ్యన్ స్పందించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఖర్చులను ఏపీ ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు వైద్యులను వెంటనే సంప్రదించాలని వీర పాండ్యన్ సూచించారు.

# వరదయ్యపాలెంలో గంజాయి ముఠా అరెస్ట్



**వరదయ్యపాలెం, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం అవంతి కాలనీ సమీపం గంజాయి ముఠా తన అక్రమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై మల్లికార్జున్ తన సిబ్బందితో కలిసి దాడులో ఏడుగురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో ఎస్సై మల్లికార్జున మాట్లాడుతూ అవంతి కాలనీ వద్ద పట్టుపడ్డ ఏడుగురి వద్ద నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, అదే విధంగా నాలుగు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో గంజాయి అక్రమ రవాణాపై వాడకంపై ఉక్కు పాదం మోపామని ఎవరైనా సమాచారం ఇస్తే కచ్చితంగా దాడులు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా యువత వ్యసనాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తల్లితండ్రులు కూడా తమ పిల్లలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రత్యేక విద్యుత్ అదాలత్

**బాలాయపల్లి,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని వినియోగదారుల కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. విద్యుత్ వినియోగదారుల బిల్లులు, మీటర్లు మొదలైన సమస్యలను విద్యుత్ అదాలత్‌లో పరిష్కరిస్తామని ఏఈ ఏడుకొండలు తెలిపారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే కురుగొండ్ల



**వెంకటగిరి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాసన సభ సమావేశాల విరామ సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి వెంకటగిరి నియోజకవర్గ సమస్యలపై సహకారం అందించాలని శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ కోరారు. శాసన సభ్యుల నుండి విజ్ఞాపనలు స్వీకరించిన అనంతరం వాటిని పరిశీలించి తగు సహకారం అందిస్తానని పవన్ కళ్యాణ్ తెలియజేశారు.

## గొల్లపల్లి రిజర్వాయర్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి శ్రీకారం

**అనంతపురం,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రసిద్ధ గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పర్యాటక సౌకర్యాల కల్పనలో భాగంగా జిల్లా పర్యాటక అధికారి కె.ఎన్. నరసయ్య మరియు వారి బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేపట్టారు. రిజర్వాయర్‌లో పర్యాటకులను ఆకర్షించేందుకు బోటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను అధికారులు పరిశీలించారు. పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అత్యాధునిక రిసార్టులు, గదుల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించారు. ప్రకృతి రమణీయతతో అలరారుతున్న ఈ ప్రాంతాన్ని జిల్లాలోనే ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. కార్యక్రమంలో టూరిజం సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొని, రిజర్వాయర్ వద్ద ఉన్న మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. త్వరలోనే దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

## డేటా సేకరణలో సమన్వయంతో పనిచేయాలి

### - జనగణన-2027 సన్నాహక శిక్షణలో పాల్గొన్న జేసీ యం.మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం బీడుపల్లిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో జనగణన-2027 ప్రక్రియపై మూడు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్వో ఇతర ఉన్నతాధికారులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫిబ్రవరి 24 నుండి 26 వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుంది. జిల్లాలోని ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏఎస్ఓఏలు, టీపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. రాబోయే జనగణనను పకడ్బందీగా నిర్వహించడం, డేటా సేకరణలో సాంకేతికత వినియోగం, క్షేత్రస్థాయి విధుల్లో తప్పులు దొర్లకుండా అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో డేటా సేకరణ అత్యంత కీలకమని, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

# గంజాయి వాడకం శారీరకంగా, మానసికంగా హానికరం

### - శ్రీసిటీ డిఎస్పి బివి శ్రీనివాసులు



**సత్యవేడు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంజాయి వాడకం శారీరకంగా, మానసికంగా చాలా హానికరమని తిరుపతి జిల్లా శ్రీసిటీ డిఎస్పి బివి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సత్యవేడు మండలం, ఇరుగుళం గ్రామం, ఇరుగుళం జడ్పీ హైస్కూల్లో గంజాయి వాడకం, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు, చిన్నారులపై నేరాలు తదితర అంశాలపై శ్రీసిటీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ బివి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం యువత గంజాయికి బానిసలై వారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అన్నారు. గంజాయి వాడకం వల్ల అనేక దుష్పరిణామాలు తప్పవు అన్నారు. ప్రధానంగా దీనివల్ల శరీరంలో శ్వాస సమస్యలు, గుండె వేగాన్ని పెంచడం, మేధో శక్తి తగ్గడం వంటి తీవ్రమైన దుష్ప్రభావాలకు కలుగుతాయి అన్నారు. దీంతోపాటు యువత ప్రవర్తనా పరమైన మార్పులకు మానసిక ఒత్తిడికి గురికాక తప్పదన్నారు. ఈ ఈమెయిల్ షిప్పింగ్ ఈమెయిల్ అయితే ఆలింకు యూజర్ను సైబర్ అటాకర్ సెటప్ చేసిన కానీ చట్టబద్ధంగా కనిపించే సైట్కు దారి మళ్ళిస్తుంది. యూజర్ వారి వివరాలను జోడిస్తారన్నారు.దాడి చేసే వ్యక్తి సున్నితమైన డేటా, మెటీరియల్ యాక్సెస్ చేయడానికి వాటిని ఉపయోగిస్తారు అన్నారు. అందువల్ల ఇటు వంటి సైబర్ మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇదే కాక చిన్నారులపై జరిగే నేరాలు, రోడ్డు భద్రత నిబంధనలు వంటి అంశాలను వివరించారు. ప్రత్యేకంగా మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగంపై కూడా విద్యార్థులకు వివరించడం జరిగింది. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై సుధీర్ కుమార్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ బాధ్యత పినాకిల్ సంస్థకు వద్దు




**గూడూరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో 12 డిపోల ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ బాధ్యతలు పినాకిల్ సంస్థకు అప్పజెప్పడం మానుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో వద్ద యూనియన్ నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చైల్డ్ కేర్ లీవ్ లను వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే మిగతా సమస్యలను కూడా పరిష్కరించాలని వారు వివరించారు. కార్యక్రమంలో ఎన్.ఎం.యు.ఎ నాయకులు ప్రవీణ్, శ్రీనివాసులు, బాషా, రమేష్, శేఖర్, సుధాకర్, గౌస్, దిలీప్, హరి, కార్మికులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి

### - ఏ.పి.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్



**గూడూరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఐ.సి.డి.ఎస్‌కి బడ్జెట్ పెంచాలని, సమాన పనికి సమాన వేతనం, ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యుయటీ అమలు చేయాలని, అంగన్వాడీలకి ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తదితర డిమాండ్ల సాధన కోసం ఏ.పీ.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరు జిల్లా గూడూరు ప్రాజెక్టు ఎన్.జి.ఓ. విశ్రాంతి భవనం ఎదుట చేపట్టిన "రిలే నిరాహార దీక్షలు" మంగళవారం రోజుకి రెండవ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో అంగన్వాడి అధ్యక్ష కార్యదర్శులు ఏ.ఇంద్రావతి, బి.ఎస్.ప్రభావతి, హెల్పర్స్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.నిరీష, ఎస్.కె.మస్తానమ్మ, సెక్టార్ లీడర్లు ఎన్.బుజ్జమ్మ, లక్ష్మి, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## పగటి పూట ఇంటి దొంగతనం కేసు ఛేదన

### - నిందితుడి అరెస్ట్, రూ.14 లక్షల ఆభరణాల స్వాధీనం

**రేణిగుంట, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న పగటి పూట ఇంటి దొంగతనాల కేసును రేణిగుంట పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి సుమారు రూ.14 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి పర్యవేక్షణలో, రేణిగుంట ఎస్‌డిపిఓ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని వేణుగోపాలపురం క్రాస్ వద్ద సీఐ ఎస్. జయచంద్ర నేతృత్వంలో, ఎస్.ఐ కె.ధర్మారెడ్డి, సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రానికి చెందిన జి. ప్రభాకరన్(32)గా పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 97 గ్రాముల బంగారు ఆభరణాలు, 110 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి అంచనా విలువ సుమారు రూ.14 లక్షలు. దర్యాప్తులో భాగంగా నిందితుడిపై గతంలో తమిళనాడు రాష్ట్రంలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇంటి దొంగతనాలకు సంబంధించిన కేసులు నమోదై ఉన్నట్లు తెలిసింది. జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలైన అనంతరం మళ్లీ దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. దొంగిలించిన ఆభరణాలను రికవరీ చేసినందుకు ఫిర్యాదుదారులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కేసు ఛేదనలో విశేష ప్రతిభ కనబరిచిన సీఐ ఎస్. జయచంద్ర, ఎస్.ఐ కె.ధర్మారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు చలపతి, రాజశేఖర్, భారుషా, హేమంత్, డి.శ్రీను, జి.గౌరి నాయుడు, చల్లముత్తు లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి దొంగతనాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.

## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

### - డిప్యూటీ సీఎంను కలిసిన గూడూరు ఎమ్మెల్యే



**గూడూరు,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతి అసెంబ్లీ సమావేశాలలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ కలసి నియోజకవర్గంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా నియోజకవర్గంలో చాలా చోట్ల ప్రజలకు తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సముద్ర తీర ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున రూరల్ వాటర్ సప్లై స్కీం కింద నిధులు మంజూరు చేయాలనీ కోరారు. నియోజకవర్గంలో తీర ప్రాంత ప్రజలకు రోడ్లు దెబ్బతిని రవాణా సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని మంజూరు అయినప్పటికీ వేయుటకు అవి ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ అనుమతులు కావాలని అధికారులు తెలుపుతున్నారని కోరారు. పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ ద్వారా కొన్ని పంచాయతీలలో సీసీ రోడ్లు మంజూరు అయినప్పటికీ వేయుటకు అవి ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ అనుమతులు కావాలని అధికారులు తెలుపుతున్నారు. కావున ఫారెస్ట్ వైల్డ్ లైఫ్ క్లియరెన్స్ అనుమతులు మంజూరు చేయాలనీ కోరారు. మంత్రి సానూకులముగా స్పందించి త్వరలో అనుమతులు మంజూరు చేస్తానని తెలిపారని అన్నారు.

# తిరుపతి జిల్లా

## రెండో రోజు కొనసాగిన అంగన్వాడీల రిలే దీక్షలు



**తొట్టంబేడు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల 32 వేల కోట్లలో ఒక్క రూపాయి కూడా అంగన్వాడీల వేతనాలకు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించక పోవడం ఎంతో బాధాకరమని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 20 నెలలు కాలం గడిచినప్పటికీ అంగన్వాడి కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతో దురదృష్టకరమని అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఐ.సి.డి.ఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం ప్రజా సంఘాలైన సి.ఐ.టి.యు, ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో రెండవ రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు నాయకులు పెనగడం గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనం వారి కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదని రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకొని అంగన్వాడి కార్యకర్తల వేతనాలను పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఎక్కడా కూడా రక్తహీనత ఉండకూడదని, పౌష్టిక ఆహారం అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ప్రతి ఒక్కరికి అందజేస్తున్నామని అంటుంటారు. కానీ పౌష్టికాహారం అందజేసే అంగన్వాడి కార్యకర్తల కుటుంబాల్లో మాత్రం చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ ఎంతో బాధాకరంగా వెల్లదీస్తున్నారని తెలిపారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సిఐటియు వారికి అండగా ఉండి పోరాటాలు చేస్తూనే ఉంటుందని అన్నారు. అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కింద ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్తకు రూ.26 వేల జీతం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని ప్రజా సంఘాల తరఫున డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 25, 26, 27వ తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు నాయకులు గంధం మణి, రాజా, రేవతి, పుష్ప, సక్కుబాయి, ఐ. ఎఫ్.టి.యు నాయకులు జాకీర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో వైసిపి క్యాడర్ రిజిస్ట్రేషన్

**నగరి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ మంత్రి శ్రీమతి ఆర్కే రోజా ఆదేశాల మేరకు మంగళవారం నగరి పట్టణంలో 9, 10వ వార్డులకు సంబంధించిన వైఎస్ఆర్సిపి క్యాడర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం పట్టణ అధ్యక్షులు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి భాగంగా 10వ వార్డు పార్టీ అధ్యక్షుడిగా నూర్‌ని నియమించడం జరిగింది. అదేవిధంగా అనుబంధ విభాగాలైన యువజన, మహిళ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల కమిటీల ఏర్పాటుపై సమగ్ర చర్చ జరిగింది. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయాలనే దిశగా ముందుకు సాగాలని నిర్ణయించడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా భాస్కరరాజు వర్ధంతి



**నగరి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశ్రాంత ఉద్యోగుల భవనం స్థలం కోసం తాను సహాయం చేసినప్పటికీ నిర్మాణ విషయంలో భాస్కర్ రాజు కృషి ఎంతో గొప్పదని మాజీ మండల అధ్యక్షులు ఎలుమలై అన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం జరిగిన బసవరాజు భాస్కర్ రాజు ప్రథమ వర్ధంతి సంస్మరణ సభకు విశిష్ట అతిథిగా విచ్చేసి ఓటు కోసం నోట్లు ఖర్చు పెట్టే ఈ రోజుల్లో నోటి మాటతో లక్షలాది రూపాయలు విరాళంగా సేకరించడం స్వర్గీయ భాస్కర్ రాజుకి మాత్రమే సాధ్యమయ్యింది అన్నారు. భాస్కర్ రాజే తనను ఆయన స్థానంలో అధ్యక్షులుగా ప్రతిపాదించినందున ఈ పదవిలో ఉన్నంత కాలం సొంత లాభం కొంత మానుకొని సంఘం సభ్యుల కోసం శ్రమిస్తాం అని సంఘం అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి అన్నారు. స్వంత నిధులతో విశ్రాంత ఉద్యోగులకు ఉచితంగా గుర్తింపు కార్డులను అందజేశారు. రాష్ట్ర బాధ్యులు కృపావరమ్మ రూ.10 వేలతో భాస్కర్ రాజు నిలువెత్తు పటాన్ని వితరణ చేయగా భాస్కర్ రాజు కుటుంబ సభ్యులు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వక్తలు యుగంధర్ రాజు, రవిశేఖర్ రాజు, శంకర్, సిద్దయ్య, జయరామా నాయుడు, నారాయణ బాబు, చెంగల్రాయ మందిడి ప్రసంగించారు. ఈ సభకు కుప్పయ్య, రామలింగం యుగంధర్ రాజు, వెంకటకృష్ణమ నాయుడు, వెంకట్రామయ్య, వెంకటకృష్ణ, కుమారవేలు, భాస్కర్ రెడ్డి, అరుణాచలం,రవిశంకర్, త్యాగరాజు, బాలసుబ్రమణ్యం, వివిధ ఉపాధ్యాయుల సంఘ నాయకులు, వందలాదిగా సభ్యులు పాల్గొని భాస్కర్ రాజుకి నివాళులు అర్పించారు. ముగ్గురు నూతన సభ్యులకు ఆహ్వానం పలికి సత్కరించారు.

## సభ్యత్వం అన్నింటికీ ఉపయోగం: జనసేన




**నాయుడుపేట,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేనా సభ్యత్వం ఫిబ్రవరి 26వ తేదీ నుండి జనసేన ఉద్యమి సభ్యత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన శ్రేణులని ఆదేశించడం జరిగింది. అందులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాకి చెందిన తిరుపతి పార్లమెంట్ పరిదిలోని సూళ్లూరుపేట, సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గాల జనసేన నాయకులు నాయుడుపేట లోని సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకి తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులును సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పరిశీలకులుగా అధ్యక్షులు నియమించడం జరిగింది. త్వరలో ఆరణి అన్ని నియోజకవర్గాలు పర్యాటస్తారని అయన తెలియజేసారు. రూ.400 సభ్యత్వం రుసుము కట్టి ఉద్యమి సభ్యత్వ నమోదు చేసుకున్నవారికి పార్టీ గుర్తింపుతో పాటు, రూ.5 లక్షలు ప్రమాద బీమా లేదా హాస్పిటల్ ఖర్చులకి రూ.50 వేలు ఇవ్వడం జరుగుతుంది. ఇది కేవలం ప్రమాదవశాత్తు సంభవించిన సంఘటనలకే వర్తిస్తుంది. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు, గూడూరు నియోజకవర్గం నుండి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు రాష్ట్ర లీగల్ సెల్ సెక్రెటరీ తీగల చంద్రశేఖర రావు, గూడూరు నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ మోహన్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణారావు, నాయుడుపేట ఏఎంసీ డైరెక్టర్ గిండి సతీష్, నాయుడుపేట శ్రీ పోలేరమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ బాలు శెట్టి, జ్యోతిష్, మూడు నియోజకవర్గాల జనసేన నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల దీక్షలకు ఏఐటీయూసీ మద్దతు

**సూళ్లూరుపేట,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంగన్వాడి కేంద్రాలలో పనిచేస్తున్న మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ కోరారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న రిలే నిరాహార దీక్ష రెండో రోజు కూడా కొనసాగుతున్నాయి. దీక్షకు ఏఐటీయూసీ తమ మద్దతును తెలిపింది. ఈ సందర్భంగా సిఐటి నాయకులు మెలుగు రమేష్ మాట్లాడుతూ వేతనాల పెంపుపై ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## మదర్ తెరిసాలో ప్రారంభమైన ఏఐసిటిఈ, డిఈఏ ల్యాబ్

### పలమనేరు ప్రాంతానికి వరం లాంటిది

**పలమనేరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరులోని మదర్ తెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో గత 20వ తేదీ ప్రారంభించబడిన ఏ ఐ సి టి ఈ -ఐ డి ఈ ఏ కళాశాలలోని విద్యార్థులు అధ్యాపకుల కేకాక పలమనేరు పరిసర ప్రాంతాలలో ఉన్న పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఇతర కళాశాలలో పనిచేసే అధ్యాపకులకు ఉపయోగపడుతుందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.రవీంద్రబాబు తెలిపారు.ఐ డిఈఏ ల్యాబ్ ప్రధాన ఉద్దేశము కొత్త విషయాలను కనుకొనడము వినూత్నంగా ఆలోచించడము వివిధ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడము యువ వ్యవస్థాపకులను తయారు చేయడం ప్రాధాన్యమైనది. ఈఐడిఈఏ ల్యాబ్‌ను ఏఐసిటిఈ వారి విధులు కళాశాల యాజమాన్యం వారు సమకూర్చిన విధులు మొత్తం 90 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగింది. ఈ ల్యాబ్‌ను వివిధ శిక్షణా కార్యక్రమాలకు వర్క్ షీప్‌ను ఏర్పాటు చేయడానికి వినూత్న విషయాలను కనుగొనడానికి ఉపయోగపడవచ్చును. ఈఐడిఈఏ ల్యాబ్ ను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం రవీంద్రబాబు, కళాశాల చైర్మన్ ఎం.ఆర్ సునీల్, డిఆర్‌డిఓ చెన్నైకు చెందిన శాస్త్రవేత్త ఎన్ వెంకటరమణతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఆర్.శరవణన్, హెచ్‌ఓడిలు అధ్యాపకులు పాల్గొన్నారు.

## శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా కాళిపీఠం ఆలయంలో వార్షిక మహోత్సవాలు

**చంద్రగిరి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని తొండవాడ గ్రామంలో ఉన్న శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా కాళి పీఠం ఆలయంలో 17వ వార్షిక మహోత్సవం సందర్భంగా లక్ష కుంకుమార్చన,సహస్ర కలశాభిషేక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పీఠాధిపతి సూరి స్వామి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలు ఫిబ్రవరి 24వ తేదీ మంగళవారం నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇందులో భాగంగా మంగళవారంఉదయం 6 గంటల నుండి 7 గంటల మధ్యఅభిషేకం నిర్వహించారు.అనంతరం ఉదయం 9 గంటలకు వేదపండితులు జి.సీతారామ శర్మ బృందంచే గణపతి పూజ, కొడి స్తంబ ఆవిష్కరణ, స్వస్తివాచనము, కలశ స్థాపన, ఆరాధన, అగ్నిప్రతిష్ట, గణపతి, నవగ్రహ హోమాలు, సహస్ర కలశ స్థాపన నిర్వహించి నైవేద్యం, హారతులు ఇచ్చిభక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు సహస్రనామార్చన, ప్రదోషకాల పూజ, నైవేద్యము, మంత్రపుష్పము హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదమువినియోగం గావించిరి.ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా తిరుపతికి చెందిన గాలి బాబు నాయుడు,పైడిపల్లి గ్రామానికి చెందిన తమ్మి రెడ్డి నరసింహ రెడ్డి వ్యవహరించారు., వీరికి ఆలయ కార్యనిర్వాహకులు పూజారి శివశంకర ప్రసాద్,వడ్డీ కాసుల రామ్మూర్తి నాయుడు తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించారు.

## కైలాస ధామంను సందర్శించిన వర్తక సంఘం నాయకులు

**చంద్రగిరి,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కైలాస ధామం కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు మంగళవారం కైలాస ధామంలో జరుగుతున్న పనులను పరిశీలించిన వర్తక సంఘం నాయకులు. కైలాస ధామంలో జరుగుతున్న, జరగబోయే పనులను వివరాలను వర్తక సంఘం నాయకులకు తెలిపిన కైలాస ధామం కమిటీ సభ్యులు.ఈ సందర్భంగా వర్తక సంఘం నాయకులు మాట్లాడుతూ గతకొన్నిసంవత్సరాలుగా చంద్రగిరి ప్రజల కలను నెరవేరుస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కైలాస ధామంకు వర్తక సంఘం తరపున తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.వర్తక సంఘం నాయకుల సూచనలు, సలహాలు స్వీకరించిన కైలాస్ ధామం కమిటీ సభ్యులు.ఈ కార్యక్రమంలో కైలాస ధామం కమిటీ సభ్యులు రమేష్ రెడ్డి,నాగరాజు నాయుడు, సైట్ ఇంజినీర్ మనోహర్ రెడ్డి,వర్తక సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, గుణ, మునిరత్నం రాయల్, రూపా రామ్, కరుణాకర్ రావు(కిషోర్),ఓంప్రకాష్, ప్రకాష్,పూస రామ్, విష్ణు ప్రకాష్, దినేష్ కుమార్, ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమైన శ్రీ కల్యాణ వెంకటరమణ స్వామివారి బ్రహ్మోత్సవాలు



**పుంగనూరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్నంలోనిశ్రీ కల్యాణ వెంకటరమణ స్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం 9.50 గం.ల నుండి 10.45 గం.ల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటరమణ స్వామి వారిని ముందుగా ఉదయం 5 గం.లకు సుప్రభాతంతో మేల్కొలిపి, తదుపరి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు, చక్రతాళ్వార్, గరుడ ధ్వజపటాన్ని ఆలయ ప్రదక్షిణగా తీసుకొచ్చారు. సకలదేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ మేషలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభంపైకిఅధిష్టింపచేశారు. రాత్రి 7 గం.లకు పెద్ద శేష వాహనంపై స్వామివారు భక్తులను ఆశీర్వదించనున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ పరిసరాలలో చలువపందిళ్లు, రంగోళీలు, క్యూలైన్లు, బారీకేడ్లు, ఆలయం, మాడ వీధుల్లో శోభాయమానంగా విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టారు. బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజు ఉదయం 8 నుండి 11 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్, టెంపుల్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా గంగా సురేష్



**కడప,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏఐటియుసి కడప జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా వి గంగా సురేష్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ కడప జిల్లా 12వ మహా సభలు ఈనెల 22, 23 తేదీలలో కడప నగరంలో జరిగాయి. ఈ మహా సభలలో కొత్త కార్యవర్గం ఎన్నుకోగా అందులో వి గంగా సురేష్‌ను కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. వి గంగా సురేష్ ఎర్రగుంట్ల మండలం దండుపల్లె గ్రామ వాసి. గతంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో ఉన్నప్పుడు విద్యా రంగ సమస్యలు పరిష్కారం కోసం, విద్యార్థుల హక్కుల కోసం, విద్యారంగ అభివృద్ధి కోసం, సమాజ అభివృద్ధి కోసం అనేకపోరాటాలు, కార్యక్ర మాలు చేశారని విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం విద్యుత్ సంస్థలలో పనిచేస్తూ కార్మికుల కోసం పనిచేస్తున్నారు. ఏఐటియుసిలో కడప జిల్లా కారనిర్వాహక అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో పలువురు వ్యక్తం చేశారు.

## ఎస్సీ, ఎస్టీ సంక్షేమ చైతన్య సభను జయప్రదం చేయండి



**కడప,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్సీ ఎస్టీ ఆత్మ గౌరవ సంక్షేమ చైతన్య సభను జయప్రదం చేయాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సల్లావుద్దీన్ పిలుపునిచ్చారు.ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 12వ తేదీ కడప నగరంలో జరగబోయే చైతన్య సభకు సంబంధించిన కరపత్రాలను డాక్టర్ బాబూ జగ్జీవన్ రావ్ విగ్రహం ఎదుట విడుదల చేసిన కార్యక్రమనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ సలావు ద్దీన్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అయినప్పటికీ ఎస్సీ, ఎస్టీలు ఇంకా కూడూ, గూడు గుడ్డ కోసం పోరాటం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల చరిత్ర రచనకు తవ్వా కృషి అభినందనీయం: ఎంపీ

**కడప,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చారిత్రకంగా, రాజ కీయంగా, సాంస్కృతికంగా ఘనత కలిగిన పులివెందుల చరి త్ర రచనకు డా.తవ్వా వెంకటయ్య చేస్తున్న కృషి అభినందనీయమని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. తనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృ తిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతగా మంగళవారం వైఎస్ అవినాష్ రెడ్డిని పులివెందులలో తవ్వా వెంకటయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. తాను త్వరలో వెలువరించనున్న పులివెందుల చరిత్ర పుస్తకం గురించి వైఎస్ అవినాష్ రెడ్డికి వివరించానని చెప్పారు. దీనిపై ఎంపి మాట్లాడుతూ కడప జిల్లాలో రాజకీయంగా, సాంస్కృతికంగా పులివెందుల తాలూకా ఎంతో వైవిధ్యం సంతరించుకుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన పులివెందుల చరిత్ర రచనకు శ్రీకారం చుట్టడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు వల్లం బాయి హృషి కేశవ రెడ్డి, వైసిపి నేతలు శివారెడ్డి, రాజేష్‌లు పాల్గొన్నారు.

## నైపుణ్య నిధిగా 'స్టార్ట్ అప్ కడప' అభివృద్ధి

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా యువతకు నైపుణ్య నిధిగా రూపుదిద్దు కుంటు న్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రె న్యూర్ షిప్ సెంటర్.. రాష్ట్రానికే స్ఫూర్తిగా నిలవనుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొ న్నారు.మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో పి4 విధానం ద్వారా జిల్లాలో ఇన్నోవే టీవ్ గా నిర్మిస్తున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిపై జేసీ డా. నిధి మీనా తోకలిసి సంబంధిత అధికారులు, కాంట్రాక్ట ర్లతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరు కూరి సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆశించే స్థాయి నుండి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతిఇంటి నుండి ఒక స్టార్ట్ అప్ గా ఎదగాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి జిల్లా యంత్రాం గం చేసిన సూపకల్పన ప్రతి యువతకు ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, , కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడి రాజా రత్నం, స్టెప్ సీఈవో నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, ఏడిపి యంగ్ ప్రొఫెషన ల్స్ తదిత రులు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా

## జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



**పుంగనూరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంను విజయ వంతం చేయాలని జనసేన నియోజకవర్గం నాయకులు ఎన్.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపుకు కార్యకర్తలకు సహకారం అందిస్తామన్నారు. నియోజకవర్గంలో 25 వేల క్రియ శీలక సభ్యత్వ నమోదులు చేయిస్తామన్నారు. నియోజకవర్గం జనసైనికులు, వీర మహిళలకు అండగా నిలిచేందుకు వారి జీవితాలకు, కుటుంబాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో జనసేన అధినేత, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టత్మాకంగా చేపట్టిన మహోత్తర కార్యక్రమంలో భాగంగా మంగళవారం చదళ్ళ గ్రామంలో నియోజకవర్గం జన సేన నాయకులు ఎన్.వేణు గోపాల్ రెడ్డి కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా ఏపిఐఐసి డైరెక్టర్ మై ఫోర్స్ మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తను కొత్త తరం నాయకులుగా తీర్చి దిద్దలనే లక్ష్యంతో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మా అధినేత పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారని అందులో భాగంగా పుంగనూరు నియోజకవర్గం జనసేన నాయకులు ఎన్.వేణుగోపాల్ రెడ్డి పవన్ కళ్యాణ్ ఆశయాలను ఆదర్శంగా చేసుకోని నియోజకవర్గంలోని కార్యకర్తల సమన్వయంతో పార్టీ సభ్యత్వం చేపట్టనున్నారన్నారు. అనంతరం ఎన్. వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు సభ్యత్వం తీసుకోవడంతో వారికీ వారి కుటుంబంకు పార్టీ అండగా ఉన్నటుందని, ఇప్పటిదాకా సభ్యత్వం కలిగిన కార్యకర్తలకు ఏదైనా ప్రమాదం సంభవించిన వెంటనే రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. పుంగనూరు నియోజకవర్గం 25 వేల సభ్యత్వాలు నమోదు చేసి మొదటి స్థానంలో నిలుపుతానని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ. మండల నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి



**పలమనేరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో ఉన్న దప్పు కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి.మునిరత్నం పేర్కొన్నారు. అందులో భాగంగా మంగళవారం పలమనేరు పట్టణంలో ఏ.ఐ బీఎస్పీ కార్యాలయం నందు గుర్రం సుబ్రహ్మణ్యం అధ్యక్షతన డప్పు కళాకారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డి.వి.మునిరత్నం, మణి మాట్లాడుతూ... పూర్వీకులు నుండి డప్పు కొట్టడం వృత్తిగా నమ్ముకుని దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న వృత్తిదారుల్లో డప్పు కళాకారులు కూడా ఉన్నారనే విషయం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియకపోవడం బాధాకరమన్నారు. శుభ, అశుభకార్యాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ముందున్న వ్యక్తులు డప్పు కళాకారులేనని గుర్తు చేశారు. డప్పులు కొట్టే సందర్భంలో కార్యనిర్వాహకులు ఇచ్చే అరా కొర సొమ్ముతో జీవనం సాగించడం కష్టతరంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ స్పందించి డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ప్రత్యేకమైన సంక్షేమం బోర్డు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రత్యేకమైన ప్రాధాన్యత ఇచ్చి నిరుపేద కుటుంబానికి రెండు ఎకరాలు భూమి, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, రుసుము ప్రభుత్వం చెల్లించాలని, కళాకారునికి డప్పు, గజ్జె, పెన్షన్ రూ.6 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక.గౌరవ అధ్యక్షులు, గుర్రం సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు టి.మునిరత్నం, కార్యదర్శి సోమశేఖర్, కోశాధికారి ఆంజప్ప, ఉపాధ్యక్షులు కృష్ణప్ప, సహాయ కార్యదర్శి నారాయణప్ప లతోపాటు గురు స్వామి, రమణప్ప, రామ్మూర్తి, శ్రీనివాసులను కమిటీ మెంబర్‌గా ఎన్నిక చేశారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

**పలమనేరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు నందు పలు అంగన్వాడీ కేంద్రాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.ఉమారాణి పేర్కొన్నారు. పలమనేరు ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్త పోస్టులు 2 అంగన్వాడి సహాయకురాలు పోస్టులు 58 ఉన్నాయి. ఈ పోస్టులకు అర్హత పదవ తరగతి పాస్ ఉండాలి. స్థిర నివాసురాలుగా ఉండాలి. దరఖాస్తులు చివరి తేదీ మార్చి 7. మరిన్ని వివరాల కోసం కార్యాలయం లో సంప్రదించాలి.

## జిల్లాలో వేగవంతంగా శనగల కొనుగోలు ప్రక్రియ

### - జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

**అనంతపురం, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో శనగల కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా మరియు వేగవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ (ఇబ్రాజ) సమావేశం నిర్వహించారు.ప్రభుత్వం ఈ ఏడాది శనగలకు క్వింటాలుకు 5,875 రూపాయలుగా మద్దతు ధరను నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా పంట సేకరణ కోసం ప్రొక్యూర్మెంట్ ఏజెన్సీలను ఖరారు చేయడం జరిగింది. రైతులు తమ సమీప కేంద్రాల్లోనే పంటను అమ్ముకునేలా పక్కా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగినన్ని ఖాళీ సంచులు అందుబాటులో ఉంచాలని, సేకరించిన పంటను వెనువెంటనే తరలించేందుకు రవాణా సౌకర్యాలను సిద్ధం చేయాలని, అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెల్లింపులు విషయమై పంట విక్రయించిన రైతులకు నిర్ణీత కాలపరిమితిలోగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూడాలని ఏజెన్సీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యం.రవి, ఏపీ మార్క్ ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పెన్నేశ్వరి, మార్కెటింగ్ ఎడి పి.రాఘవేంద్ర, జిల్లా రవాణా అధికారి బి.సురేష్ నాయుడు, డిఎల్సిఓ కె.వెంకటరామి రెడ్డి, డి.ఆర్.డి.ఏ ఏపీయం యం.నారాయణ స్వామి మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ క్యాలెండర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్





**కడప,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం అధునాతనంగా ప్రచురించిన 2026 సంవత్సరం క్యాలెండర్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృ ద్ధి కార్యక్రమాల వివరాలతో కూడి న క్యాలెండర్లను జిల్లాలోని అన్ని శాఖలకు పంపిణీ చేయాలని సమా చార పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారికి జిల్లా కలెక్టర్ సూచిం చారు. ఈ కార్యక్రమంలో జేసీ డా.నిధి మీనా, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, డిఆర్డీఏ పీడి రాజ్య లక్ష్మి, హౌసింగ్ పీడి రాజా రత్నం, స్టెప్ సీఈవో నోడల్ అధికారి జోయ ల్ విజయ్ కుమార్, డీఐ పిఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

### - తాగునీరు, రోడ్ల నిర్మాణాల కోసం వినతి పత్రం అందజేత - సానుకూలంగా స్పందించిన పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు

**అనంతపురం,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌తో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత భేటి అయ్యారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆమె పవన్ కళ్యాణ్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా భేటి అయ్యారు. తమ నియోజకవర్గంలో తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. వేసవి కాలం మొదలైన నేపథ్యంలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారనుందని.. దీని వలన గ్రామస్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో అత్యవసర నీటి సరఫరా పనులను అమలు చేయడం కోసం సీపీడబ్ల్యూఎస్ కు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతపురము రూరల్ మండలములోని 27 గ్రామాలకు, మరియు ఆత్మకూరు మండలములోని 25 గ్రామాలకు ఇస్తున్న సమగ్ర సురక్షిత మంచినీటి పథకం ఇంతవరకు సత్యసాయి నీటి పథకంపై ఆధారపడి ఉందన్నారు. పథకం ఏర్పాటు చేసి 30 సంవత్సరాలైనా.. ఇప్పటికీ అంతరాయాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ 52 గ్రామాలకు గాను రూ.50కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అనంతపురము రూరల్ మండలంలోని 12గ్రామాలకు, రాప్తాడు మండలంలోని 26 గ్రామాలకు ఇంత వరకు సరైన నీటి సౌకర్యం లేక తాగునీటికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అనంతపురం రూరల్ ప్రాంతాల్లో సమ్మర్ స్టోరేజి ట్యాంకును, పైపు లైనుల మరమ్మత్తులు చేయడంతో పాటు 2ఎం.ఎల్.డి. స్లో సాండ్ (రూ) ఫిల్టర్ల స్థానంలో 6ఎంఎల్.డి. రాపిడ్ సాండ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు రూ.55 కోట్ల అవసరం ఉంటుందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో అన్ని



గ్రామాలకు తాగునీటి అవసరాలకు గొల్లపల్లి రిజర్వాయర్ నుండి సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు రామగిరి, కనగానపల్లి, సీ.కే.పల్లి, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రోడ్లు చాలా దయనీయ స్థితిలో ఉన్నాయన్నారు. దీని వలన చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ రోడ్ల పునర్నిర్మాణం కోసం రూ.11.50 కోట్లు రూపాయలు అవసరం ఉన్నందున నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. తాగునీటి అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలలో జలజీవన్ మిషన్ క్రింద చేస్తున్న పనులకు సంబంధించిన బిల్లులతో పాటు ఈ రూ.11.50కోట్ల రోడ్డు పనులకు అనుమతులు మంజూరు చేస్తానని, గతంలో అడిగిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించవచ్చని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి పనులు, సమస్యల పై మంత్రులను కలిసిన ఎమ్మెల్యే సునీత**

రాప్తాడు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అలాగే సమస్యలపై ఎమ్మెల్యే పరిటాల సునీత పలువురు మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అసెంబ్లీ లాబీలోనే మంత్రి నారా లోకేష్ ని కలిసి ఆత్మకూరు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలకు ఆడిటోరియం, కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.60లక్షల నిధులు కేటాయించాలని కోరారు. ఆత్మకూరు మండలంలో ఎస్సీ ఎస్టీ జనాభా ఎక్కువగా ఉండటం వలన ~ూరాజౌ= స్కూల్ మంజూరు చేయాలని, ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో పెండింగ్ లో ఉన్న ననసకోటలో ఎంజేపీ బాలికల గురుకుల జూనియర్ కాలేజీ ఫైల్ క్లియర్ చేయాలని కోరారు. రామగిరి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల కోసం హాస్టల్ మంజూరు చేసి భవన నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మరో మంత్రి మండ్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండల కేంద్రాల్లో అసంపూర్తిగా ఉన్న స్పోర్ట్స్ స్టేడియంలను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆత్మకూరు మండలంలో నూతన స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి జనార్ధన్ రెడ్డిని కలిసి అనంతపురం బైపాస్ - కనగానపల్లి రోడ్డుకు రూ.30కోట్లు, కనగానపల్లి-చిగరచెట్టు రోడ్డుకు రూ.20కోట్లు, ధర్మవరం-కళ్యాణదుర్గం రోడ్డులకు రూ.22కోట్లు, అనంతపురం-చిగిచెర్ల రోడ్డుకు రూ.18కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి సంబంధిత పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## మదనపల్లిలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ



**మదనపల్లె,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 2026–27 సంవత్సరానికి గాను జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ నిశాంత్ కుమార్‌చే అక్రిడిటేషన్ కార్డులను డిఎంఎసి కమిటీ సభ్యులకు మంగళవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మొదటి సమావేశంలో ఆమోదం పొందిన 267 మంది పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడం జరిగింది. అక్రిడిటేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న మిగిలిన పాత్రికేయులకు కూడా వారి అర్హత మేరకు తదుపరి సమావేశంలో మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.

## గ్రామాలు అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- టిడిపి జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్**



**ములకలచెరువు,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాలలో పూర్తిస్థాయిలో అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని టిడిపి జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్ అన్నారు. మండలంలోని కోనేటి వారి పల్లి పంచాయతీ కోట చౌడేశ్వరి నగర్ నందు ఎంజిఎన్ ఆర్జిఎస్ నిధులతో 10.40 రూపాయలతో సిసి రోడ్ల ప్రారంభోత్సవంలో ఎంపీడీవో హరి నారాయణ టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రగుడి సురేష్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం గురించి పట్టించుకోకుండా పోవడంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందకుండా పోయాయి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినక ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో సిసి రోడ్లు తాగునీటి సౌకర్యం పరిశుభ్రత వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామాలలో సిసి రోడ్లకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎగవేంటి శంకర, సిరాజు రఫీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మునుస్వామి, రెడ్డప్ప బావజన్, తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 5న తెలుగు ప్రేక్షకుల ముందుకు 'విధాత' చిత్రం

**- నిర్మాత డా.అప్పినపల్లి భాస్కరాచారి, దర్శకుడు మణికంఠ రాజేంద్ర వెల్లడి**




**మదనపల్లె,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మార్చి 5న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రేక్షకుల ముందుకు విధాత సినిమా రాబోతోంది. ఇందులో సినిమా నిర్మాత మరియు కథా నాయకుడు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి,దర్శకుడు మణికంఠ రాజేంద్ర బాబులు తలమునకలై వున్నారు.మదనపల్లె కేంద్రంగా స్థానికంగా ప్రతిభ కలిగిన నటీనటులతో,మెదటి ఏబిసి ప్రొడక్షన్ పైన తెరకెక్కిన మెదటి సినిమా గా విధాత చిత్రం చరిత్ర సృష్టించబోతోంది.నిర్మాతే సాహసం చేసి తన సినిమాను,ప్రేక్షక దేవుళ్ళు ఆదరిస్తారన్న విశ్వాసంతో,సొంతంగా సినిమాని విడుదల చేయడానికి నిర్ణయించుకున్నారు.సినిమా ప్రమోషన్ కోసం, చిత్ర పరిశ్రమలోని, పెద్దలతో కలసి వారి మద్దతును కూడగట్టారు. అంతేకాకుండా సినిమాను ప్రజలు, ప్రేక్షకులు దృష్టిని అకట్టుకోవడానికి విస్తృత ప్రచారానికి తెర తీసారు. ఇప్పటికే సెన్సార్ పక్రియను పూర్తి చేసుకున్న సినిమా మంచి సందేశంతో పాటు, అన్నివర్గాల ప్రజలను అకట్టుకునేవిధంగా ఉంటుందని దర్శకులు రాజేంద్ర బాబు, నిర్మాత అప్పినపల్లి భాస్కరాచారి స్పష్టం చేశారు.మదనపల్లె నుండి ఏబిసి ప్రొడక్షన్ ఏర్పాటు చేసి, స్థానిక నేపథ్యం కలిగిన నటీనటులతో,మదనపల్లె పరిసరాలతోపాటు బెంగుళూరు, హైదరాబాద్, వైజాగ్ ప్రాంతాల్లో చిత్ర నిర్మాణం జరుపుకున్న విధాత చిత్ర నిర్మాణానికి సాహసం చేసిన నిర్మాత అప్పినపల్లి భాస్కరాచారికి ప్రేక్షకులు అండగా నిలిచి అందరిస్తే మదనపల్లె ఖ్యాతిని ఇనుమడింప చేయడంతోపాటు మరిన్ని చిత్రాలు నిర్మాణం చేయడానికి ముందుకు రావడం,నూతన నటులకు అవకాశాలు ఇవ్వడం, మదనపల్లె పేరు రాష్ట్రం,దేశ వ్యాప్తం కానుంది.విధాత చిత్రానికి దర్శకులు, కెమెరా మెన్,ఎడిటర్ మణికంఠ రాజేంద్ర బాబు కాగా హైదరాబాద్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంది.ఈ చిత్రానికి కథా రచయత అప్పలబట్ల సురేష్,గాయకులు సింధూజా శ్రీనివాస్,సురేష్ కాగా నటి నటులు మదనపల్లికి చెందిన వారేవున్నారు.కుటుంబం కలసి విక్షించే విధంగా, పాటలు, ఫైట్స్,హాస్యంతో అద్భుతమైన మ్యూజిక్ తో తెర కెక్కిన విధాత చిత్రం హైదరాబాదులో జరిగిన ప్రీమియర్ షోలో సినీ పరిశ్రమ వర్గాల పెద్దల నుండి ప్రశంసలు, అభినందనలు వెలువెత్తాయి. ఈ చిత్రంలో ఒక చిన్న సాధారణ రైతు కూలీ,తన జీవితంలో తన కుటుంబాన్ని సర్వస్వాన్ని కోల్పోయి,అనంతరం తన జీవితంలో కొత్త ప్రస్థానాన్ని ఎలా ప్రారంభిస్తాడు, కుటుంబానికి తాను దూరం కావడానికి కారణమైన వారికి ఎవిధంగా గుణపాఠం చెప్పి సమాజానికి ఎలాంటి సందేశం ఇచ్చాడో అనేవిధంగా ముందుకు సాగే ఈ సినిమా అద్భుతంగా వచ్చిందని,ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా సినిమాను చూసి ఆదరించి ప్రోత్సహించాలని కోరారు.

## వెలుగు వృద్ధాశ్రమంలో డెమెన్షియా స్క్రీనింగ్




**మదనపల్లె,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం లోని కోళ్ళబైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు సంస్థలో వెలుగు వృద్ధాశ్రమం నందు మంగళవారం దివ్యాంగులు వయో వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ తొమ్మిదొవ తరగతి చదువుతున్న విద్యార్థులు, కరెస్పాండెంట్ సహదేవ్ రెడ్డి కలసి ఇంటర్ జెనెరేషనల్ బాండింగ్ కార్యక్రమం, డెమెన్షియా స్క్రీనింగ్ కార్యక్రమం, సమగ్ర శ్రేయస్సు (హోలిస్టిక్ వెల్ బీయింగ్) ప్రొడ్యాక్టీవ్ ఏజింగ్ వర్క్ షాప్ సదస్సుకు హాజరయ్యారు. కార్య క్రమానికి ముఖ్య అతిధులుగా బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరెస్పాండెంట్ సహదేవరెడ్డి, డా.బి.రమేష్ బాబు డిపిమో డియం, ఆఫీస్ మదనపల్లె, డా.ఎం. ఫ్రూఖాన్ ఖాన్ మెడికల్ ఆఫీసర్ పీహెచ్సి, బొమ్మన చెరువు హాజరయ్యారు. వెలుగు సెక్రటరీ ఎం ఉదయ్ మోహన్ రెడ్డి సిబ్బంది తో కలసి బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ను సందర్శించి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఇంటర్ జెనెరేషనల్ బాండింగ్ ప్రోగ్రాం ను విద్యార్థిని విద్యార్థులతో కలసి చెయ్యాలని కోరగా, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ చిన్నారులను ఉద్దేశించి, వృద్ధులతో తమకున్న అనుబంధాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలి, వృద్ధుల చట్టాలను, విలువలను గురించి వివరించారు. తొమ్మిదో తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు వృద్ధా శ్రమాన్ని సందర్శించి, వృద్ధులతో కలసి ప్రేమతో పలకరించారు. అనంతరం కృష్ణ కిషోర్, ఉదయ్ మోహన్ రెడ్డి, వెలుగు సిబ్బంది అందరూ కలసి కరెస్పాండెంట్ సహదేవ రెడ్డి ని శాలువాతో సత్కరించి మొమెంటో ను అందజేశారు. హోలిస్టిక్ వెల్ బీయింగ్ ద్వారా వృద్ధులకు యోగాను తమ దినచర్యలో భాగంగా చేర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉందని డా.బి రమేష్ బాబు, తెలిపారు. యోగ మాస్టర్ అనిత లక్ష్మి యోగ ఉపయోగాలను తెలియజేసి, వృద్ధులచేత సూర్యనమస్కారాలు చేయించారు. వృద్ధులు తయారుచేసిన దీపం కాంతులు, ఒత్తులు , గ్రీటింగ్ కార్డ్స్, వైర్ బుట్టలు, ఇలా తమకు వచ్చిన చేతి పనుల ప్రదర్శన లో పెట్టారు. డెమెన్షియా స్క్రీనింగ్ కార్యక్రమంలో మెడికల్ టీం అంతా కలసి డాక్టర్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు మెడికల్ చెకప్ చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీహెచ్ఈఓ కె శ్రీనివాసులు, పిహెచ్ఎన్ టి.విజయ కుమారి, సూపెర్వైసర్ ఏస్ . శ్రీనివాసులు, సూపెర్వైసర్ ఎం.పార్వతమ్మ, హెచ్‌డబ్యూసి సిబ్బంది, ఆశ వర్కర్స్ , సిహెచ్ఓలు, ఏఎన్ఎంఒలు, వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనా కుమారి, వార్డెన్ స్వీటీ, సోషల్ వర్కర్ గీత, వెలుగు సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

## గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయంలో భారీ చోరీ

**- కట్టర్లతో గేట్లు, తలుపులు ధ్వంసం చేసిన దొంగలు**


**- రూ.25 లక్షల నగదు, వెండి కిరీటాలు అపహరణ**



**మదనపల్లె,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో దొంగలు రెచ్చిపోయారు. ఏకంగా దేవుని గుడినే కొల్లగొట్టారు. అనపగుట్టలో కొలువున్న శ్రీకృష్ణుని ఆలయం తలుపులు, గేట్లను కట్టర్లతో ధ్వంసం చేసి రెండు హుండీలలోని నగదు, దేవుళ్ళ విగ్రహాలపై ఉన్న మూడు వెండి కిరీటాలు బంగారు తాళి బొట్లు, ఇతర నగలు, నగదును దొంగలు దోపిడీ చేశారు. మంగళవారం ఉదయం శ్రీకృష్ణుని ఆలయానికి పూజలు చేసేందుకు వచ్చిన ఆలయ పూజారికి గుడిలో చోరీ జరిగిందని గుర్తించి వెంటనే ఆలయ కమిటీకి సమాచారం అందించారు. వారు వెంటనే ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ మహమ్మద్ రఫీ ఎస్సై రహీముల్లా, శ్రీరాములు, సిబ్బంది హుటాహుటిన అనపగుట్టకు చేరుకుని కృష్ణుని ఆలయంలో చోరీ జరగడాన్ని పరిశీలించారు. విషయాన్ని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి దృష్టికి తీసుకెళ్లడంతో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను మదనపల్లికు పంపించారు. అనపగుట్టలోని కృష్ణుని ఆలయం వద్దకు చేరుకున్న జాగిలాలు, క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించి అణువణువు గాలించారు. దొంగలు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు, అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయంలో ఉన్న వాచ్‌మాన్ తన భార్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స కోసం వెళ్లడం గమనించిన దొంగలు గ్యాస్ కట్టర్లు వినియోగించి తలుపులు కిటికీలను ధ్వంసం చేసి గుడిలో ఉన్న రెండు పెద్ద సైజు హుండీలను ధ్వంసం చేసి అందులోని నగదును పెద్ద మొత్తంలో అపహరించారు. అలాగే శ్రీకృష్ణుడి కిరీటం, సత్యభామ మెడలో ఉన్న బంగారు మంగళ సూత్రాలు, ఇతర దేవుళ్ల విగ్రహాలపై ఉన్న మూడు వెండి కిరీటాలు సుమారు రూ.25 లక్షలకు విలువైన నగలు నగదు అపహరించుకుపోయారు. చోరీకి పాల్పడిన దొంగలను త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు.భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా, దొంగలు శ్రీకృష్ణుని గుడిలో చోరీకి పాల్పడం బాధాకరమన్నారు. నిందితులను త్వరగా పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

## మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వై.వనజ

**- శుభాకాంక్షలు తెలిపిన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది**



**మదనపల్లె,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వై.వనజ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఎఫ్ఏసి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్య శేఖర్ రెడ్డి ఆరోగ్య కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో సోమవారం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా (ఐఏఎస్) నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా వై.వనజ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2011లో ఏపీపీఎస్సీ డిగ్రీ లెక్చరర్ పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకు సాధించి మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలిగా విధుల్లో చేరడం జరిగిందన్నారు. ప్రస్తుతం అదే కళాశాలకు ఎఫ్ఏసి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్తు, మహిళా కళాశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించిన వై.వనజను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టిటిపి మోహన్ బాబు, అధ్యాపకులు శ్రీనివాసులు, గురుమూర్తి, విష్ణుప్రియ, మోహన వల్లి, జ్యోతి సుబ్బరాయుడు, హాజీరా ఖానమ్, కుసుమ ప్రియ కళాశాల సిబ్బంది శేఖర్, మొగిలీశ్వరి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మిట్స్ వర్సిటీలో ఎయిరో మోడలింగ్ డిజైన్ శిక్షణ

**- హాజరైన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.రఘువీర కుమార్**

**మదనపల్లె/కురబలకోట, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు యెన్.సి.సి 11 ఎయిర్ వింగ్ కేడెట్ల కోసం రెండు రోజుల పాటు ఎయిరో మోడలింగ్ డిజైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎయిరోమోడలింగ్ మరియు అడ్వెంచర్ శిక్షణలో నిపుణుడైన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్,ఫ్లయింగ్ ఆఫీసర్ ఎం.రఘువీర కుమార్ (బద్వేల్) హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా కేడెట్లను జాతీయ స్థాయి వాయు సైనిక్ క్యాంపు (వీ.ఎస్.సి) పోటీలకు సిద్ధం చేయడం ప్రధాన లక్ష్యమన్నారు.విమానాల ప్రాథమిక సూత్రాలు, గాలి ఒత్తిడి, సమతుల్యత వంటి అంశాలపై అవగాహన పొందడం ద్వారా విమానయాన రంగంపై స్పష్టమైన అవగాహన కలిగిస్తుందన్నారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విమాన నమూనాల తయారీ మరియు ఫ్లయింగ్ నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు.ఇటువంటి శిక్షణల ద్వారా కేడెట్లలో సాంకేతిక జ్ఞానం, క్రమశిక్షణ, టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.ఈ శిక్షణ భవిష్యత్తులో ఎయిర్ ఫోర్స్, విమానయాన ఇంజినీరింగ్ మరియు రక్షణ రంగాల్లో కెరీర్ అవకాశాలకు బలమైన పునాది అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, ఎన్.సి.సి 11 ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి మరియు ఎన్.సి.సి ఎయిర్ వింగ్ క్యాడెట్ విద్యార్థులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## జిల్లాలో 'చలో కలెక్టర్' విజయవంతం చేయాలి



**పీలేరు,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ నెల 27న రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్నమయ్య జిల్లాలో నిర్వహించనున్న చలో కలెక్టర్ ఆఫీస్ ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీలేరు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కమిటీ అధ్యక్షులు బి.వి.రమణ, ఆర్.ఓబులయ్య పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాలో జిల్లాలోని గ్రామపంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా పీలేరు గ్రామ పంచాయతీ కార్మికులు అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులి రెడ్డప్ప, బి.నాగార్జున, మస్తాన్, రాధారాణి, గోపి, సరోజ, ధన, భాగ్య, ప్రతాప్ రెడ్డి, ఎస్.సరోజ, అశోక్, భాస్కర్, గురు తదితరులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓబి పనులు త్వరగా పూర్తి చేయాలి: ఎన్ఎస్‌యూఐ



**పీలేరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో నేషనల్ హైవే పరిధిలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్.ఓ.బి) నిర్మాణ పనుల తీవ్ర జాప్యం నేపథ్యంలో డివిజనల్ ఇంజనీర్ సుజాతకి సీఐ యుగంధర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో అమృత్ తేజ మాట్లాడుతూ ఆర్.ఓ.బి పనుల ఆలస్యం కారణంగా పట్టణ ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు, ముఖ్యంగా చిరు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల ఆలస్యానికి బాధ్యులైన కాంట్రాక్టర్‌పై తక్షణ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, పనులను వేగవంతం చేసి స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని డిమాండ్ చేశారు.


## ఎఐలో నైపుణ్యం ఉంటే విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు

**మిట్స్‌లో 'ఎక్సపర్ట్ సిస్టమ్స్ ఇన్ ఇంజనీరింగ్'పై మాజీ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.వేణుగోపాల్ రావు**




**మదనపల్లె / కురబలకోట, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎక్స్‌పర్ట్ సిస్టమ్స్, కృత్రిమ మేధస్సు (ఎఐ)లో నైపుణ్యం కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మాజీ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.వేణు గోపాల్ రావు పేర్కొన్నారు. మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (అర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగం వారు మంగళవారం ఏఐసిటిఈ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి), న్యూఢిల్లీ వారి సహకారంతో విద్యార్థుల కోసం ఎక్స్‌పర్ట్ సిస్టమ్స్ ఇన్ ఇంజనీరింగ్ అంశంపై ప్రత్యేక అతిధి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన డి.అర్.డీ.ఓ మాజీ శాస్త్రవేత్త, డిఫెన్స్ రంగంలో మెటలర్జీ, ఆధునిక లోహ సాంకేతికతల అభివృద్ధిలో కృషి చేసిన డాక్టర్ ఏ.వేణుగోపాల్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌పర్ట్ సిస్టమ్స్ అనేవి మనుషుల అనుభవం, జ్ఞానాన్ని కంప్యూటర్‌లో నిల్వ చేసి సమస్యలను పరిష్కరించే విధానమన్నారు. ఇంజనీరింగ్‌లో వచ్చే క్లిష్టమైన సమస్యలను నియమాలు, ప్రత్యేక రంగానికి సంబంధించిన జ్ఞానం ద్వారా ఎలా పరిష్కరించవచ్చో ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. డిఫెన్స్ రంగంలో చేసిన పరిశోధనల ఆధారంగా, ముఖ్యమైన యంత్రాలు సరిగా పనిచేయడంలో, లోపాలను ముందుగా గుర్తించడంలో, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ సిస్టమ్స్ ఉపయోగాన్ని తెలిపారు. బ్లాక్‌బాక్స్ ఏ.ఐ మోడళ్లతో పోలిస్తే ఎక్స్‌పర్ట్ సిస్టమ్స్ నిర్ణయాలు ఎలా తీసుకుంటాయో స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. భవిష్యత్తులో తెలివైన నిర్ణయ వ్యవస్థలకు మంచి అవకాశాలు ఉన్నాయని, దేశ సాంకేతిక అభివృద్ధిలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. ఎక్స్‌పర్ట్ సిస్టమ్స్, కృత్రిమ మేధస్సు(ఎఐ)లో నైపుణ్యం కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థలు డి.అర్.డీ.ఓ, ఇస్రో వంటి సంస్థలలో డేటా సైంటిస్ట్, సిస్టమ్ అనలిస్ట్, రోబోటిక్స్ ఇంజినీర్, ఆటోమేషన్ ఇంజినీర్ వంటి అవకాశాలతోపాటు, క్వాలిటీ కంట్రోల్, డెసిషన్ సపోర్ట్ సిస్టమ్స్ అభివృద్ధి వంటి రంగాల్లో నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థులు ఉన్నత వేతనాలు, అంతర్జాతీయ అవకాశాలు మరియు పరిశోధన రంగాల్లో మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోగలరన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మ, కో–ఆర్డినేటర్ తారకేశ్వర్ రాజు, కో–కోఆర్డినేటర్లు జి.నితిన్,సుభాష్ దాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాఫీ వర్క్ షాప్‌లో అగ్ని ప్రమాదం: రూ.లక్ష ఆస్తి నష్టం




**మదనపల్లె, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మల్లికార్జున సర్కిల్ వద్దగల వరుణ్ కుమార్‌కు చెందిన వర్మ కాఫీ వర్క్ షాప్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి జి శివప్ప తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పూర్తిస్థాయిలో మంటలను ఆర్పి వేశారు. షాప్ యజమాని మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కాఫీ కవర్స్, ప్రింట్ బ్లాక్, ఎలక్ట్రికల్ ఎక్విప్మెంట్, కాఫీ మిషన్, మరి కొన్ని వస్తువులు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని తెలిపారు. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని యజమాని వాపోయారు.

## టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్



**పీలేరు, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టిడిపి కార్యాలయంలో మంగళవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. న్యాయపరమైన దీర్ఘకాలికాకంగా పరిష్కారం కానీ సమస్యలకు ప్రజా దర్బార్ ద్వారా పరిష్కారం అవుతాయని, ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా ప్రతి మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే ప్రజా దర్బార్ ప్రతి సమస్యకు పరిష్కారం అవుతాయని మంగళవారం జరిగిన ప్రజాదర్బార్లు రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి శ్రీనాథ్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, ఏఎంసి డైరెక్టర్లు గోళ్ళ కిషోర్ నాయుడు, రహంతుల్లా, కోడె రామకృష్ణారెడ్డి సింగల్ విండో డైరెక్టర్ పుల్లయ్య, రెడ్డిముని, చంద్రయ్య టిడిపి నాయకులు కార్యకర్తలు, వై.పి చంద్రజ్యోతి, సివిఏపియు సభ్యులు శ్వేతా, లీల విష్ణుప్రియ, స్వాతి పాల్గొన్నారు.

# ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు

**-యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలపై విమర్శలు -యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతం గా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడు తున్నాయి.

## యూత్ కాంగ్రెస్ నేతలు వీర సింహాలు

**వారు దేనికీ భయపడబోరన్న రాహుల్**

**భోపాల్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** ఢిల్లీలోని భారత్ మండపంలో ఫిబ్రవరి 10న జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో చొక్కాలు విప్పి నిరసనలు తెలిపిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. దేశ ప్రతిష్ఠను దిగజార్చే చర్యలకు కాంగ్రెస్ పాల్పడిందంటూ ఈ ఘటనపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండగా, తాజాగా ఐవైసీ కార్యకర్తలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడారు. ఐవైసీ కర్యకర్తలను అత్యంత ధైర్యవంతులైన సింహాలుగా అభివర్ణించారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పని లేదన్నారు. 'షర్ట్‌లెస్' నిరసనలకు సంబంధించి యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు మంగళవారంనాడు అరెస్టు చేశారు. తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారణ జరిపి అరెస్టు చేశారు. అనంతరం ఆయనకు పాటియాలా హౌస్ కోర్టు నాలుగు రోజుల కస్టడీ విధించింది. కాంగ్రెస్ నిరసనలకు ప్రధాన సూత్రధారి చిబ్ అని, ఇది జాతీయ భద్రత, దేశ సార్వభౌమాధికారం, సమగ్రతకు చెందని కేసు అని పోలీసులు చెబుతున్నారు. దీనిపై భోపాల్‌లో జరిగిన కిసాన్ మహాచౌపల్‌లో రాహుల్ గాంధీ స్పందించారు. యూత్ కాంగ్రెస్ సభ్యులంతా బబ్బర్ షేర్‌లు. మీరు ఎవరికీ భయపడాల్సిన పని లేదు. మీలో దేశభక్తి రక్తం ఉంది. మీరు హరిత విప్లవం తీసుకువచ్చారు. పరిశ్రమలు తీసుకొచ్చారు. ఐటీ విప్లవం తెచ్చారు. వీటన్నింటికీ మోదీ చరమగీతం పాడారు' అని రాహుల్ అన్నారు.

## కన్నతల్లి కరకశత్వం

**-రెండునెలల చిన్నారి కిరాతక హత్య**

**-కట్టెల పొయ్యిలో వేసి హతం**

**హైదరాబాద్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్న తల్లి అత్యంత దారుణంగా హత్య చేసింది. బాలుడిని క్టటెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఏడవకుండా నోట్లో బట్టలు కుక్కి, కాళ్లు కట్టేసి మరి హత్య చేసింది. బౌరంపేట్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగింది. ఈ ఘటనపై స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బిహార్ కు చెందిన కుటుంబం బౌరంపేట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద పని చేస్తున్నట్లు సమాచారం.నవమోసాలు మోసిన బిడ్డను అతి దారుణంగా చంపడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు పసిబిడ్డను చంపడానికి ఆమెకు మనస్సు ఎలా వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తల్లి ఇలా ఎందుకు చేసిందో తెలియాల్సి ఉంది. అలానే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరించారు.

## ప్రజా సమస్యలపై స్పందన..

**5 అర్జీలు స్వీకరణ...**

**నందిగామ ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ప్రజల నుంచి ఐదు అర్జీలను స్వీకరించారు. పట్టణ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు స్వీకరించిన అర్జీలలో శానిటేషన్‌కు సంబంధించిన ఒకటి, ఆక్రమణలకు సంబంధించిన రెండు, కొత్త డ్రైనేజ్ నిర్మాణానికి సంబంధించిన రెండు అర్జీలు ఉన్నాయి. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న ఇబ్బందులను వివరించగా కమిషనర్ శ్రద్ధగా విన్నారు. అర్జీలను పరిశీలించిన అనంతరం సంబంధిత శాఖ అధికారులను వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి నివేదిక సమర్పించాలని సూచించారు. పట్టణాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని కమిషనర్ పేర్కొన్నారు.

## నందిగామలో రాత్రి వేళ గర్జించిన మేఘాలు...

**నందిగామ ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామలో ఎండలు ముదురుతున్న తరుణంలో పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి వరుణుడు కరుణించాడు. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని ఈదురు గాలులు, ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిశాయి. రోజంతా మండిపోయిన ఎండలతో ఇబ్బందులు పడిన ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. సాయంత్రం నుంచి ఆకాశం మబ్బులతో నిండిపోవడంతో వాతావరణంలో మార్పు కనిపించింది. అనంతరం గాలుల వేగం పెరిగి ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. కొన్నిచోట్ల తక్కువసేపే కురిసినా, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు జల్లులు పడ్డాయి. ఈదురు గాలుల కారణంగా చెట్ల కొమ్మలు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వాతావరణ శాఖ వివరాల ప్రకారం, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఈ అకాల వర్షాలు నమోదయ్యాయి.

## గంగూరులో జూదంపై మెరుపు దాడి...

**నందిగామ ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగూరు గ్రామంలో జూదంపై పోలీసులు సోమవారం మెరుపు దాడి నిర్వహించారు. గ్రామంలోని ఠాగూర్ రైస్ మిల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా జూదం ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన కొందరు పారిపోవడానికి ప్రయత్నించగా, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.55,250 నగదును స్వాధీనం చేసుకున్నారు.

## గణపతి ఆచూకీ కనుగొన్న పోలీసులు

**-నేపాల్‌లో ప్రవాసంలో ఉన్నట్లుగా గుర్తింపు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు ఆచూకీ లభ్యమైంది. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్‌లో ఆయన మకాం వేశారు. తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కార్యదర్శి పదవిని గణపతి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. మరో వైపు హైదరాబాద్‌లో పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట నలుగురు కీలక మావోయిస్టులు లొంగిపోనున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సెక్రటరీ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డితోపాటు మన్నె నరసింహారెడ్డిలు లొంగిపోనున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ అడవుల్లో ఎస్ఐబీ ఎదుట దేవ్ జీతోపాటు మల్లా రాజిరెడ్డి లొంగిపోయిన సంగతి తెలిసింది. అదేకాక దేవ్ జీతోపాటు పలువురు అగ్రనేతలు మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలకు చేరుకున్నారంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కర్రెగుట్టల ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మరణించిన విషయం విదితమే. 2026, మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశిరచుకొంది. ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీంతో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. వేలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు అరెస్టయ్యారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో పలువురు అగ్రనేతలు సైతం మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పోలీసులకు చిక్కితే.. మావోయిస్టు పార్టీ చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

## ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం

**ప్రజల సమస్యల కోసం ఇకముందూ పోరాడుతాం**

**లొంగిన మావోయిస్ట్‌లు దేవీజీ, రాజిరెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** మావోయిస్ట్ పార్టీకి చెందిన అగ్రనేతలు డిజిపి ఎదుట లొంగిపోయారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఈ సందర్భంగా దేవ్‌జీ మీడియాతో మాట్లాడుతూ.. 'అనారోగ్య కారణాల రీత్యా నేను లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్ధాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. ప్రజల సమస్యలపై ప్రజల్లో ఉండి పోరాటం చేస్తాను. త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. నేను ఏది మాట్లాడినా అపార్థాలకు దారితీసే విధంగా ఉంటుంది. నేను రాజకీయ జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీరడిగే ప్రశ్నలకు నేను చెప్పే జవాబు.. రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించవద్దని అన్ని విషయాలు పంచుకోవడం లేదు' అని అన్నారు. మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. చట్ట ప్రకారమే పోరాటం చేయాలని లొంగిపోయాం. మావోయిజం అనేది ఎప్పటికీ అంతం కాదు. కొన్ని ప్రశ్నలను ప్రభుత్వంతో చర్చిస్తాం. త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు చెప్తాం' అని అన్నారు.

## బాలికల రక్షణ చట్టాలపై అవగాహన

**మచిలీపట్నం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా రక్షణ చట్టాలు మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పిస్తున్న కృష్ణాజిల్లా పోలీసులు,మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, శక్తి టీం ఈగల్ టీం సభ్యుల ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని విజయానంద డిగ్రీ కాలేజీ నందు విద్యార్థినీ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వ్యసనం, సైబర్ క్రైమ్, పోక్సో చట్టం, శక్తి యాప్ యొక్క ఆవశ్యకత, ట్రాఫిక్ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వలన శారీరక, మానసిక సామాజికంగా కలిగే తీవ్రమైన దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు.. అదనంగా సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం, అనుమానాస్పద లింకులు, ఫేక్ అకౌంట్లు, ఆన్‌లైన్ మోసాల నుండి జాగ్రత్తలు తీసుకోవడం వంటి విషయాలు తెలిపారు. పిల్లల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, చట్టపరమైన రక్షణలు సహాయ మార్గాల గురించి కూడా విద్యార్థులకు తెలియజేసారు.

## 'అక్షర ఆంధ్ర' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరి

**అనంతపురం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో 'అక్షర ఆంధ్ర' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లాలో 1,25,578 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. వార్డుస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అక్షర కేంద్రాలను అధికారులు సందర్శించి హాజరు శాతం పెంచి కార్యక్రమాన్ని సజావుగా నడిపించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన రహర్, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు!

**-అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోదీ -మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్**

**భోపాల్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్దాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

## ఏళ్ల తరబడి పని చేస్తున్నా అరకొరా వేతనాలేనా...

**-రెండవ రోజుకు చేరిన అంగన్వాడీల రీలే నిరాహార దీక్ష...**




**నరసరావుపేట, ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని ఏపి అంగన్వాడీ వర్కర్స్ ఽ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం గాంధీ పార్క్ ధర్నా చౌక్ లో అంగన్వాడీలు చేపట్టిన రీలే నిరాహార దీక్షలు మంగళవారం 2వ రోజుకు చేరుకున్నాయి.ఈ దీక్షలను శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి పూల మాలలు ప్రారంభింప చేశారు. ఈ సందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షురాలు గుంటూరు మల్శీశ్వరి మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5 రోజుల రీలే రిలే దీక్షలకు పిలుపునిచ్చామన్నారు. అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనంతో పాటు గ్రాట్యూటి అమలుకు గైడ్ లైన్స్ రూపొందించాలని మిగిలిపోయిన 1810 మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో వేతనాల కోసం ఆందోళన చేయగా మద్దతు తెలిపి భరోసా ఇచ్చిన టిడిపి, జనసేన నాయకులు అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ పల్నాడు ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, నాయకులు అహల్య,సుజాత, భాగ్యలక్ష్మి, అమల,తులసి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ఏపిడబ్ల్యూజెఎఫ్ సంఘీభావం...

అంగన్వాడీలకు కనీస అమలు చేయాలని బడ్జెట్లో అందుకు తగినట్లు నిధులు కేటాయించాలని ఏపిడబ్ల్యూజెఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు బిఎన్.ప్రసాదరావు అన్నారు. అంగన్వాడీల దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు.గౌరవ వేతనంతో విశేష సేవలు అందిస్తున్న అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించి వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఏపిడబ్ల్యూజెఎఫ్ యూనియన్ నాయకులు జిలాని, ఆదాం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శిష్టకరణాల సామాజిక వర్గాన్ని ఆదుకోవాలి

**-సామాజిక భవనాలకు నిధులు మంజూరు చేయాలి.**



**మచిలీపట్నం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఉద్యోగ, ఉపాధి ఆర్థిక రంగాల్లో వెనుకబడిన శిష్టకరణాలను ఆదుకోవాలని టిడిపి శిష్టకరణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, ఏపీ శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కుమహంతి రాజా కేంద్ర విమానాయనశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల రెండు రోజుల పర్యటనకు ఆదివారం విచ్చేసిన ఆయన కిడ్నీ తదితర సమస్యలల్లో ఉన్న కొన్ని శిష్టకరణ కుటుంబాలను పలకరించారు. అనంతరం శ్రీకాకుళం లో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ను కలిసి శిష్టకరణాల దయనీయ స్థితిగతులను వివరించారు. ముఖ్యంగా కేంద్ర బీసీ జాబితాలో శిష్ట కరణ సామాజిక వర్గాన్ని చేర్పించడం లో ప్రయత్నాన్ని ముమ్మరం చెయ్యాలని, సామాజిక భవన నిర్మాణాలకు, స్థలాలు- నిధులు కేటాయించడంలో, ఆర్థిక చేయుత నిమిత్తం సంక్షేమ పథకాలు సంపూర్ణంగా చేరడం కోసం శిష్టకరణ కార్పొరేషన్ కు చైర్మన్, డైరెక్టర్ లను నియమించడం లో కృషి చెయ్యాలని కోరారు. సోమవారం దివంగత ప్రజానేత కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన అరసవల్లి లో గల మాజీ టీడీపీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిఇంటికి చేరుకుని ఆమె భర్త మృతి కారణంగా ఆమెకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ తో కూడా ముచ్చటిస్తూ టిడిపి ప్రభుత్వ ప్రగతిని, ఒకనాటి నాయకుల కృషిని గుర్తుచేసుకున్నారు. శిష్టకరణ సాధికార సమితి రాష్ట్ర నాయకులు మానాపురం గౌరీశ్వర రావు సదాశివుని వెంకటేశ్వర రావు, మునగవలస రవీంద్రబాబు, కుప్పిలి వెంకట రమణమూర్తి, కరకవలస ప్రహ్లాదరావు, ఎస్విడి మురళి, ఆర్వీన్ శర్మ, పెదపెంకి శ్రీరామ్ కుమార్, బలివాడ గోవిందరావు, డబ్బీరు వెంకట రావు , బెహరా నాగేశ్వర రావు తదితరులు వీరితోపాటు ఉన్నారు.

## అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల నుండి వస్తు సేవల పన్నులు సజావుగా వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో వాణిజ్య పన్నుల వసూలు పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఆస్తులు, భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. తప్పనిసరిగా వస్తు సేవల పన్నులు వసూలు అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత వ్యక్తులకు సంబంధించి బ్యాంకు వివరాలను కూడా వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. పట్టణాలలో గాని గ్రామ పంచాయితీలలో గాని ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్ లు తప్పనిసరిగా వస్తు సేవల పన్ను చెల్లించాల్సి ఉంటుందని అటువంటి వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. అలాగే పౌర సరఫరాలు, తూనికలు కొలతలు, గనులు భూగర్భ శాఖల అధికారులు టాస్క్ ఫోర్స్ ఏర్పాటై ఉమ్మడిగా వాహనాలను తనిఖీ చేసి వస్తు సేవల పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో కూడా వృత్తి పన్ను వసూలు చేస్తున్నారా లేదా విచారించి అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ జి కల్పన, అదనపు ఎస్పీ వి నాయుడు, వాణిజ్య పనుల శాఖ సహాయ కమిషనర్లు సౌమ్య, జగదీష్, రాజకుమార్, డిపిఓ డాక్టర్ జె అరుణ, డిఎస్ఓ మోహన్ బాబు జెడ్పి డిప్యూటీ సీఎం సిఈఓ ఆనంద్ కుమార్ జిల్లా ఆడిట్ అధికారి సూర్య ప్రకాష్ రావు జిల్లా రిజిస్ట్రార్ గోపాలకృష్ణ గనులు భూగర్భ శాఖ ఏజీ కొండారెడ్డి మచిలీపట్నం తాడిగడప ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, నజీర్, రామారావు వాణిజ్య పన్నుల శాఖ డి ఏ సి చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## దళారుల చేతిలో మోసపోకండి



**పత్తిపాడు ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి ఎం. పద్మావతి అన్నారు. విత్తనాలు నుంచి పంటి విక్రయం వరకు ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెదనందిపాడు మండలం పాలపర్రులోని జీడీసీఎంఎస్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎం.పద్మావతి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పద్నాలుగు శాతం తేమ ఉండేలా చేసుకోవాలన్నారు. తొలుత రైతులు రైతు సేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకుని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఎకరానికి పన్నెండు క్వింటాళ్ల చొప్పున, ఒక రైతు 40 క్వింటాళ్ల వరకు విక్రయించుకోవచ్చని వివరించారు. ఈ క్రాప్ ఆధారంగా జీడీసీఎంఎస్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర రూ. 5,870కు శనగలు విక్రయించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం టి. నరసింహారెడ్డి, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్. మోహన్‌రావు, మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.




# దురంధర్ టీమ్ భలే స్ట్రోక్ ఇచ్చింది

ప్రాణానికి ప్రాణం అనేది పాత సామెత. స్ట్రోకుకు స్ట్రోకు కొత్త ట్రెండ్. ఇటీవలే ఒక ఇంటర్నేషనల్ మ్యాగజైన్ కు చెందిన ఇండియన్ ఎడిషన్ అవార్డుల ఫంక్షన్ నిర్వహించింది. దానికి బాలీవుడ్ నుంచి బడా సెలబ్రిటీలు హాజరయ్యారు. సదరు బ్రాండ్ పవర్ అలాంటిది. కానీ దురంధర్ బృందం నుంచి ఒక్కరు రాలేదు. పన్నెండు వందల కోట్లకు పైగా వసూలు చేసి, ఎనభై రోజులకు దగ్గరవుతున్నా, ఇంకా థియేటర్లలో ఆడుతున్న అరుదైన మూవీగా, యాంకర్ గొప్పగా ప్రశంసిస్తూ అవార్డును తీసుకోవాల్సిందిగా కోరుతూ అనౌన్స్ మెంట్ ఇచ్చింది. తీరా చూస్తే అక్కడ ఎవరు లేరు. హీరో నుంచి దర్శకుడి దాకా అందరూ ఆబ్సెంట్. ఎందుకయ్యా అంటే దురంధర్ మీద నెగటివ్ రివ్యూ ఇచ్చి దీన్నో యాంటీ పాకిస్థాన్ కంటెంట్ గా వర్ణించిన రివ్యూయర్ సదరు మ్యాగజైన్ ఎడిటర్ కాబట్టి. రిలీజ్ టైంలో ఆవిడ సమీక్ష మీద తీవ్ర విమర్శలు రావడంతో ఆ వీడియోని యూట్యూబ్ నుంచి తొలగించడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. అనలిస్ట్ గా చాలా పేరున్న ఆమెకు అదో బ్లాక్ స్పాట్ లా మిగిలిపోయింది. కట్ చేస్తే ఇప్పుడు వాళ్లే స్వయంగా అవార్డు ఇస్తామని చెప్పినా దురంధర్ టీం రాకుండా ఝలక్ ఇచ్చింది. సినిమా బాలేదని చెప్పడం తప్పు కాదు. అది వ్యక్తిగత అభిప్రాయం. కానీ శత్రుదేశానికి మద్దతనిపించేలా కామెంట్స్ చేయడం చాలా మందికి నచ్చలేదు. ఇప్పుడీ వీడియో ఎక్స్ లో బాగా వైరల్ అవుతోంది. దీని సంగతి అలా ఉంచితే దురంధర్ టీమ్ చాలా ఒత్తిడిలో ఉంది. మార్చి 19 విడుదల తేదీ ఎంతో దూరంలో లేకపోవడంతో పోస్ట్ ప్రొడక్షన్ పరుగులు పెట్టిస్తూ ప్రమోషన్లను ప్లాన్ చేసుకొంటోంది. ముఖ్యంగా పోటీలో ఉన్న టాక్సిక్ ఎంతో అడ్వాన్స్ గా స్క్రీన్లను బ్లాక్ చేసుకునే పనిలో ఉండటంతో దురంధర్ 2 సైతం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఏడాది అతి పెద్ద ఓపెనింగ్స్ తెచ్చుకునే అవకాశాలు ఉన్న రెండు సినిమాలు ఇలా పరస్పరం తలపడటం గురించి ట్రేడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎవరైనా వెనక్కు తగ్గే అవకాశాలు నూటికి నూరు శాతం లేవు.



# చరణ్‌పై మచ్చ పడనివ్వని అల్లు శిరీష్



మెగా, అల్లు బంధం మీద ఎప్పటికప్పుడు రకరకాల ఊహాగానాలు, అనుమానాలు వస్తూనే ఉంటాయి. ఇరు కుటుంబాల మధ్య సంబంధాలు ఒకప్పట్లా లేవంటూ సోషల్ మీడియాలో అభిమానులు తెగ చర్చించుకుంటూ ఉంటారు. కానీ సినిమా సంబంధిత విషయాలు ఎలా ఉన్నా కుటుంబ పరంగా కలవాల్సిన సందర్భాలు వచ్చినపుడు.. ఎంతో అన్యోన్యంగానే వ్యవహరిస్తుంటారు ఇరు కుటుంబాల సభ్యులు. అల్లు వారి కుటుంబంలో మార్చి 6న ఒక శుభకార్యం జరగనున్న సంగతి తెలిసిందే. అల్లు అరవింద్ చిన్న కొడుకు శిరీష్ ఆ రోజే ఒక ఇంటివాడు కాబోతున్నాడు. గత కొన్ని రోజులుగా పెళ్లి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఓవైపు శుభలేఖలు పంచుతున్నారు. ఇంకోవైపు సంబరాలు జరుగుతున్నాయి. అల్లు బ్రదర్స్ కలిసి ఇటీవలే కుటుంబ సభ్యులు, సన్నిహితులకు గ్రాండ్ పార్టీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో రామ్ చరణ్ సైతం పాల్గొన్నాడు. ఐతే ఏటా ఈ సమయంలో చరణ్ స్వామి మాల వేస్తాడన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా మాలలో ఉండే పార్టీకి హాజరయ్యాడు. ఐతే అందరూ మద్యం తాగే పార్టీకి స్వామి మాల వేసుకున్న చరణ్ ఎలా వచ్చేడనే ప్రశ్నలు సామాజిక మాధ్యమాల్లో తలెత్తుతున్నాయి. ఇన్‌స్టాలో తాజాగా ఒక నెటిజన్ "చరణ్ స్వామి" అంటూ ఒక కామెంట్ పెట్టాడు. ఐతే స్వామి మాల వేసుకుని పార్టీలో పాల్గొన్నాడని చరణ్ మీద ఎక్కడ అపవాదు పడుతుందో అని అల్లు శిరీష్ ఈ కామెంట్ మీద వెంటనే స్పందించాడు. తమలో ఎవ్వరూ ఆల్కహాల్ ముట్టకముందే చరణ్ స్వామి ఈ పార్టీకి వచ్చాడని.. తమను విష్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడని.. అయ్యప్పస్వామి పట్ల తన ప్రేమ, నిబద్ధత వేరని వ్యాఖ్యానించాడు. చరణ్ మీద ఎలాంటి అపవాదు పడకుండా జాగ్రత్త పడ్డ శిరీష్ మీద మెగా, అల్లు ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా పరిచయం అయిన నయనికను మార్చి 6న హైదరాబాద్‌లో పెళ్లాడబోతున్నాడు శిరీష్.

# రోమియో రక్తంలో ఏం చూపించబోతున్నారు




న్యాచురల్ స్టార్ నాని తన ఇమేజ్ ని ఏ దిశగా తీసుకెళ్తున్నాడో ప్రేక్షకులకు పూర్తి క్లారిటీ వచ్చేస్తోంది. దసరాతో తెచ్చుకున్న మార్కెట్ ని సరిపోదా శనివారం, హిట్ 3తో బలపరుచుకుని ఆగస్ట్ లో రిలీజయ్యే ది ప్యారడైజ్ తో దాన్ని పీక్స్ కు తీసుకెళ్తాడనే నమ్మకం ఫ్యాన్స్ లో పూర్తిగా ఉంది. ఇదిలా ఉండగా దీని తర్వాత చేయబోయే మూవీ అఫీషియల్ అనౌన్స్ మెంట్ వచ్చేసింది. ఓజి ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో రూపొందబోయే మూవీకి బ్లడీ రోమియో టైటిల్ ఫిక్సైయిపోయింది. ఇది గతంలో లీకైన న్యూస్ అయినప్పటికీ ఫైనల్ గా అధికారిక ముద్ర పడింది. ఇవాళ నాని బర్త్ డేకి చిన్న యానిమేషన్ టీజర్ వదిలారు. హీరో క్యారెక్టరైజేషన్ ఎలా ఉండబోతోందో వేరే ఆర్టిస్టుల వాయిస్ ఓవర్ ద్వారా వినిపించారు. అదిరిరిపోయే వంటకు దినుసులు ఎంత ముఖ్యమో వాటిని అద్భుతంగా వాడే చెఫ్ కూడా అంతే అవసరం. అలాగే శత్రువులను తుదముట్టించి మాఫియా సామ్రాజ్యాన్ని చేజిక్కించుకోవాలనుకునే వాళ్లకు తెగించే మనస్తత్వం, అడ్డొస్తే చంపిపారేసే క్రూరత్వం ఉండాలి. అలాంటి చేయి తిరిగిన వంటగాడే రోమియో. పేరుకి తగ్గట్టే ఇతనికో ప్రేమకథ కూడా ఉంటుంది. విజువల్స్ లో కిచెన్, సిలిండర్, దానికి బాంబు కట్టడం, రోమియో నాన్ వెజ్ వండటం, బిల్డింగ్ బ్లాస్ట్ అయితే అతనొక్కడే బయటికి రావడం ఇవన్నీ కార్టూన్ స్టైల్ లో చూపించారు. మొత్తానికి రోమియో రక్తంలో హింస బాగానే ఉండబోతోంది. గ్యాంగ్ స్టర్ అని స్పష్టంగా చెప్పేశారు కాబట్టి మరో ఓజి లాంటి కంటెంట్ తో సుజిత్ ఏదో మేజిక్ చేయడానికి రెడీ కాబోతున్నారు. వేసవి నుంచి షూటింగ్ ప్రారంభించబోతున్నారు. ప్రవీణ్ వైరా దీనికి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూర్చగా ఈ కాన్సెప్ట్ మీద పెద్ద టీమే వర్క్ చేసింది. వెంకట్ బోయిన్ పల్లి నిర్మాతగా వ్యవహరించే ఈ మూవీ హీరోయిన్, టెక్నికల్ టీమ్ తదితర వివరాలు వెల్లడించాల్సి ఉంది. దసరా, హిట్ 3 ది థర్డ్ కేస్, సరిపోదా శనివారం, ప్యారడైజ్ ఇలా లైనప్ మొత్తాన్ని ఇంటెన్స్ డ్రామాలతో నింపేస్తున్న నాని బ్లడీ రోమియోతో దాన్ని నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లబోతున్నాడు.

# బిజినెస్ న్యూస్

## గేమింగ్ లవర్స్ కోసం ఐకూ కొత్త ఫోన్.. ఊహించని ధరకు 15R



గేమింగ్ లవర్స్ ఎక్కువగా ఇష్టపడే ఐకూ బ్రాండ్ నుంచి మరో కొత్త స్మార్ట్‌ఫోన్ లాంచ్ అయ్యింది. ఐకూ 15 సిరీస్‌లో ఐకూ 15=ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. స్నాప్‌డ్రాగన్ 8 జన్ 5 ప్రాసెసర్, 7,600 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీతో ఈ ఫోన్‌ను తీసుకురావడం గమనార్హం. ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో తీసుకొచ్చిన ఈ ఫోన్ ధర, ఇతర వివరాలు ఇప్పుడు చూద్దాం.. ఊుబా 15= ంజూవఎఆటఆ–ఝఆశీఅం: ఐకూ 15ఆర్ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజిన్ ఓఎస్ 6తో పనిచేస్తుంది. దీనికి నాలుగేళ్లు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 6.59 అంగుళాల 1.5ఖ అమోలెడ్ డిస్‌ప్లే, 120ఎఓ రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. హెచ్‌డీఆర్ 10 సర్టిఫికేషన్, గేమింగ్ సమయంలో 144 ఎఓ రిఫ్రెష్ రేటుతో ఈ ఫోన్ పనిచేస్తుంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ జన్ ఎస్5 ప్రాసెసర్ అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 700వీ ప్రధాన కెమెరా ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. ముందు వైపు 32 ఎంపీ కెమెరా ఇచ్చారు. వైఫై 7, బ్లూటూత్ 6, టైప్–సీ పోర్ట్, ఐపీ68, ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది. ఇందులో 7,600 ఎంఏహెచ్ బ్యాటరీ 100ఔ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. ఊుబా 15= జూతీఅఎవ: ధర విషయానికొస్తే.. ఐకూ 15ఆర్ మూడు స్టోరేజీ వేరియంట్లలో లభ్యమవుతుంది. దీని ధర రూ.50 వేల పైనే ఉంటుందని ఊహించినప్పటికీ.. అంతకంటే తక్కువ ధరకే తీసుకురావడం గమనార్హం. 8జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.44,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీం 256జీబీ వేరియంట్ రూ.47,999, 12జీబీం 512జీబీ వేరియంట్ రూ.52,999గా నిర్ణయించారు. డార్క్ నైట్, ట్రయంఫ్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. అమెజాన్, ఐకూ ఇండియా, వివో రిటైల్ స్టోర్లలో నేటి నుంచి బుకింగ్స్ స్వీకరిస్తున్నారు. మార్చి 3 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్‌కార్డ్/డెబిట్ కార్డు కొనుగోళ్లపై రూ.4వేలు డిస్కౌంట్ పొందొచ్చు. రూ.1899 విలువ చేసే ఐకూ/వివో టీడబ్ల్యూఎస్‌ను ఉచితంగా అందిస్తున్నారు.

## భారీ నష్టాల్లో సూచీలు: సెన్సెక్స్ 1069 పాయింట్లు డౌన్.. కారణాలు ఇవే



దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, కొత్త ఏఐ టూల్స్ మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ ఓ దశలో 1300 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,450 దిగువకు చేరాయి. మదుపర్ల సంపద రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.466 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,052.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,294.66) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,934.73 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1068.74 పాయింట్ల నష్టంతో 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్ల నష్టంతో 25,424.65 స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5173 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రముఖ ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ క్లాడ్ కోడ్ అనే కొత్త టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా పాతకాలపు ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అయిన జూదీూా కోడ్‌ను చాలా వేగంగా, తక్కువ ఖర్చుతో ఆధునీకరించవచ్చని ఆ సంస్థ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు, ప్రభుత్వాలు, ఇన్సూరెన్స్ సంస్థలు వాడే ఐబీఎం మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లలో అత్యధికంగా ఈ లాంగ్వేజ్‌నే ఉపయోగిస్తారు. ఈ సిస్టమ్స్‌ను అప్‌డేట్ చేయడం ఐబీఎంకు ఒక ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. ఆంత్రోపిక్ ప్రకటన వల్ల ఐబీఎం వ్యాపారంపై ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఒక్కరోజే ఆ కంపెనీ షేర్లు 13 శాతానికి పైగా కుంగాయి. 26 ఏళ్లలో ఎన్నడూ లేని స్థాయిలో ఐబీఎం నష్టాన్ని చవిచూసింది. ఐటీ రంగంలో వస్తున్న ఈ మార్పులు భారతీయ ఐటీ కంపెనీలపైనా ప్రభావం పడింది. ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సుంకాల విషయంలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో మరోసారి టారిఫ్ భయాలు నెలకొన్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ భయాలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు మోసం కేసు.. 24 గంటల్లో నిధులు వెనక్కి




చండీగఢ్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ శాఖలో చోటుచేసుకున్న మోసం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వానికి చెందిన రూ.556 కోట్ల నిధులు రికవరీ అయినట్లు హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మంగళవారం వెల్లడించారు. రూ.22 కోట్ల వడ్డీ సహా దాదాపు రూ.556 కోట్ల నిధులు 24 గంటల్లో వెనక్కి వచ్చినట్లు అసెంబ్లీ సాక్షిగా సీఎం వెల్లడించారు. చండీగఢ్ శాఖలోని మధ్య, చిన్నస్థాయి ఉద్యోగులు కలిసి ఈ మోసానికి పాల్పడినట్లు బ్యాంకు తెలిపిందని సైనీ పేర్కొన్నారు. ఈ మోసానికి పాల్పడింది ప్రైవేటు వ్యక్తి అయినా, ప్రభుత్వ ఉద్యోగి అయినా సహించేది లేదన్నారు. హరియాణా ప్రభుత్వానికి చెందిన బ్యాంకు ఖాతాల నుంచి రూ.590 కోట్ల మేర మోసానికి గురైనట్లు బ్యాంక్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో దర్యాప్తునకు ఏసీబీని ఆదేశించినట్లు సీఎం తెలిపారు. ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలోని ఓ కమిటీ కూడా ఏర్పాటు చేశారు. మోసం కేసు వెలుగుచూసిన అనంతరం నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో 16 శాతం మేర పతనమైన ఐడీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నేడు కోలుకున్నాయి. ఎన్‌ఎస్‌ఈలో ఒక శాతం లాభంతో రూ.71.08 వద్ద ట్రేడవుతోంది. హరియాణా ప్రభుత్వానికి సంబంధించి కొన్ని ఖాతాలకే ఈ మోసం పరిమితమైందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ వి.వైద్యనాథన్ తెలిపారు. శాఖలోని మిగతా వినియోగదార్ల ఖాతాలకు ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

**-జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు**




**తిరుపతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా రీ ఓపెన్‌కి ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్ గా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్ మాండ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పీజీఆర్ఎస్ అర్జీలకు నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. పరిష్కారం చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని, తప్పుడు ఎండార్స్మెంట్ ఇవ్వరాదన్నారు. ప్రతి సోమవారం అన్ని మండల పరిధిలో, డివిజన్ పరిధిలో తప్పని సరిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని, కార్యక్రమం నిర్వహించు ప్రదేశం, సమయం అర్జిదారులకు తెలిసేలా ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. అర్జీ దారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానంగా విని సంతృప్త స్థాయిలో పరిష్కారం చూపాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి-3 విధానాన్ని జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పి-3 అమలులో గ్రామ, మండల స్థాయిలో ప్రజల చురుకైన భాగస్వామ్యం ఉండాలని, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి, పారదర్శకత, బాధ్యతతో సమన్వయంతో నిర్వహించాలని పి-3 ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతాయని, ప్రజల నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ఐ.వి.ఆర్.ఎస్, పి-4, సర్వే, టెంపుల్, హెల్త్ తదితర అంశాల పై అధికంగా ఫిర్యాదులు వస్తున్నందున సంబందిత సచివాలయ సిబ్బంది వాటిపైన అవగాహన కలిగి ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని, ఎటువంటి పిర్యాదులు రాకుండా చూడాల్సిన బాద్యత సంబందిత శాఖల వారిదేనని సూచించారు. సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, ,డిడిఓ నారాయణ రెడ్డి, డి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ జగదీష్ సిపిఓ వెంకటేశ్వర్లు, డిఎంఅండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి,అనిమల్ హస్బండ్రీ జెడి డాక్టర్ రవికుమార్, రవాణా శాఖ అధికారి మురళీమోహన్, డిఎస్ఓ రాజు, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, డిఆర్‌డిఏ పిడి శోభన్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, సంబందిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి ట్రస్టు నిధులతో శివాలయానికి రూ.20 లక్షలు మంజూరు

**- 26న శంకుస్థాపన**



**శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామంలోని ఎస్టీ కాలనీ శివాలయానికి శ్రీవాణి ట్రస్టు నిధుల ద్వారా రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నెల 26వ తేదీ ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఎమ్మెల్యే సహకారంతోనే ఈ నిధులు మంజూరయ్యాయని వారు పేర్కొన్నారు. చుక్కల నిడిగల్లు చెరువు సమీపంలో, స్వర్ణముఖి నది తీరంలో వెలసిన విశ్వరూప లింగంతో సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ శివాలయం గత కొంతకాలంగా నిర్లక్ష్యానికి గురైంది. సుమారు 30 సంవత్సరాల క్రితం కొందరు దుండగులు నిధుల కోసం విగ్రహాన్ని పక్కకు జరిపినట్లు స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి శివాలయానికి సరైన నిర్మాణం లేకపోవడంతో స్వామివారు నీడలేకుండా ఉన్నారు. ఈ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన చర్యల ఫలితంగా శ్రీవాణి ట్రస్టు నిధులు మంజూరయ్యాయి. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోకు ఆలయ పరిస్థితిని వివరించగా, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, కమిషనర్ తదితరుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి దేవస్థానం వేద పండితులు శివప్రసాద్ శర్మ తదితరుల ఆధ్వర్యంలో ముందుగా బాలాలయం ఏర్పాటు చేసి శివలింగాన్ని తాత్కాలికంగా ప్రతిష్టించారు. గుడి నిర్మాణం పూర్తయిన అనంతరం మళ్లీ అదే స్థలంలో శివలింగాన్ని ప్రతిష్టించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక భక్తులు, గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## వైసిపి కుటుంబాలను పరామర్శించిన నేదురుమల్లి

**వెంకటగిరి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వాకాడు మండలం వాకాడు గ్రామ పంచాయతీలోని కైకాలవీధికి చెందిన వైయస్సార్ సిపి నాయకులు పసుపులేటి చంద్రయ్య మనవడు (ధనశేఖర్ కుమారుడు) రోషన్ ఇటీవల మరణించినారని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి చంద్రయ్యని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా అదే గ్రామము లోని దీజ కాలనీకి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు బత్తిన సుధాకర్ గారి సతీమణి కోటమ్మ ఇటీవల మరణించినారని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి సుధాకర్‌ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట వాకాడు, కోట, మండల నాయకులు ఉన్నారు.




## హుండీ లెక్కింపు ద్వారా వరసిద్ధుని ఆదాయం రూ.కోటి 30 లక్షలు

**కాణిపాకం,ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు మంగళవారం జరిగిన హుండీ లెక్కింపు ద్వారా 18 రోజులకు గా ను 1,30,10,749 రూపాయలు అలాగే బంగారం 88 గ్రాములు, వెండి ఒక కిలో 189 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా 12,732 రూపాయలు, నిత్య అన్నదానం హుండీ ద్వారా 87,484 రూపాయలు, ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ డాలర్స్ 340, ఆస్ట్రేలియా డాలర్స్ 100, మలేషియా రింగ్ ఇట్స్ 69, కెనడా డాలర్స్ 40, యూరో 180, ఇంగ్లాండ్ పౌండ్స్ 20, సౌదీ రియల్ 5 ఆదాయం వచ్చినట్లు కాణిపాకం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి పెంచల కిషోర్ , చైర్మన్ మణి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఫస్ట్ బోర్డు సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓ లు ఎస్వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరావు, పర్యవేక్షకులు వాసు, కోదండపాణి, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే, జాతీయ రహదారులు ప్రాజెక్టుల భూసేకరణ పనులను పూర్తి చేయాలి

**- యూనియన్ అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా పరిధిలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీసిటీ ఫేస్-2, ఎల్‌జి ఫేస్-2, స్పేస్ సిటీ ఫేస్ 1,2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు చర్చించారు. ఏడీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పిడిలు, రైల్వే ప్రాజెక్టు అధికారి జె ఈ ప్రభాకర్, సదరన్ రైల్వే ఈఈ శేఖర్, ఈఈ ఇరిగేషన్ సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు, తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ ఫేజ్-2, ఏపిఐఐసి లోని ఎల్‌జి ఫేజ్-1,2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, శ్రీసిటీ ఫేజ్-1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం




అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి-శ్రీకాళహస్తి, ఏర్పేడు-పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి-కాట్పడి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట- కడప, రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యతతో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్రో, కరకంబాడి, ఎమ్ఐజి లే అవుట్ తిమ్మాజి కండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల అధికారులకు సూచించారు. రైల్వే పనులపై నడికుడి-శ్రీకాళహస్తి, ఏర్పేడు-పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి-కాట్పడి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట-కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యతతో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్రో, కరకంబాడి, ఎమ్ఐజి లే అవుట్ తిమ్మాజి కండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, శ్రీసిటీ మేనేజర్ భగవాన్, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భాస్కర్, శివప్రసాద్, శిరీష భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపిడబ్ల్యూజెఎఫ్‌చే ఛలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ




**తిరుపతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ చేసింది. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 4న నిర్వహించనున్న 'చలో విజయవాడ' పోస్టర్‌ను మంగళవారం తిరుపతిలో ఆవిష్కరించారు. స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలోని ఏపీడబ్ల్యుఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో ఆ సంఘం రాష్ట్ర నాయకులు వలిగలం గోపి, శ్రీధర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు సమస్య సంవత్సరాల తరబడి పరిష్కారం కావడం లేదని, ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన జర్నలిస్టులు సమస్యలు మాత్రం ఎక్కడా వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందన్నారు. జర్నలిస్టులకి గతంలో అమలవుతున్న రైలు ప్రయాణంలో 50 శాతం రాయితీ, జర్నలిస్టుల సంక్షేమ నిధిని తిరిగి ప్రారంభించాలన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, ఆరోగ్య బీమా, నాణ్యమైన వైద్యం అందరికీ అందేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, 50 సంవత్సరాలు పైబడిన వర్కింగ్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని, జర్నలిస్టులకు కనీస వేతనాలు కేటాయిస్తూ మజీదియా సిఫార్సులను అమలు చేయాలంటూ ముఖ్యమైన 13 డిమాండ్ల పరిష్కారం కోసం, రాష్ట్ర రాజధానిలో భారీ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జరిగే బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి వందలాది మంది జర్నలిస్టులు హాజరవుతారని, జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, సీనియర్ జర్నలిస్టులు మోహన్ రావు, చెంగలరాయలు, గౌస్ బాషా, పి.సురేంద్ర, బాలసుబ్రమణ్యం, తులసీరామ్, వెంకటేష్, సుదర్శన్ రెడ్డి, సుదీర్, వాణి, శేఖర్, నాగరాజు, గోవర్ధన్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## స్క్రాప్ తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి**



**తిరుమల, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీలోని వివిధ విభాగాల్లో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన స్క్రాప్ తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీలోని అన్ని విభాగాల్లో ఉన్న స్క్రాప్‌ను గుర్తించి 15 రోజుల్లో రిపోర్ట్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఆరు నెలలకు ఒకసారి ప్రతి విభాగంలో స్క్రాప్ తొలగింపునకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. వేలం ద్వారా ఆ స్క్రాప్‌ను ఎప్పటికప్పుడు విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఫీడ్ బ్యాక్ వ్యవస్థ అద్భుత ఫలితాలు ఇస్తోందని, దీనిని ఇదేవిధంగా కొనసాగించాలని చెప్పారు. భక్తుల నుండి సేకరించిన అభిప్రాయాలతో తిరుమలలో ప్రజా రవాణా, అన్న ప్రసాదం, పారిశుద్ధ్య సేవలు విశేషంగా మెరుగయ్యాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎఫ్ఎంఎస్, కళ్యాణకట్ట, లగేజ్ సెంటర్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. భక్తులు విరాళాలు అందించేందుకు వీలుగా తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రిలో కూడా కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన పలు ఇంజినీరింగ్ పనుల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో సిఈ సత్య నారాయణ, ఇతర విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

**తిరుపతి, ఫిబ్రవరి 24(నేటి మనదేశమ్ ప్రతినిధి):** మార్చి నెల 16 నుండి ఏప్రిల్ 1 వరకు జరుగనున్న పదవ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు నిర్వహించే పదవతరగతి పరీక్షలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలన్నారు. పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. జిల్లా నుండి సుమారు 31334 మంది (29165 మంది రెగ్యులర్ విద్యార్థులు,గత సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులు 1178 మంది 991 మంది ఓపెన్ స్కూల్స్ ద్వారా) పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. మొత్తం 179 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయని,ప్రశ్నా పత్రాలను స్ట్రాంగ్ రూమ్ లకు తీసుకెళ్లేటప్పుడు పటిష్టమైన బందోబస్తు ఉండాలని




తెలిపారు. పరీక్షా పేపర్ల తరలింపుపై జిల్లా స్థాయిలో సంబంధిత పోలీస్ అధికారులు, పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర ఉన్నతాధికారులతో సహా ఏ ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు తీసుకువెళ్లరాదన్నారు. మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్‌లు, విద్యుత్ సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, వైద్యాధికారులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్.టి.సి బస్సులు తగు విధంగా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్, డిప్యూటీ కమిషనర్ బి సుధ, తిరుపతి మునిసిపల్ అడిషనల్ కమిషనర్ శారదా దేవి, డిపిఓ సుశీలా దేవి, డిఎమ్ అండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్, రవాణా శాఖ అధికారి మురళీమోహన్, ట్రెజరి అధికారి మృదుల, ఏపి ఎస్ఆర్‌టిసిసి చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథ్, ఏపి ఎసపిడిసిఎల్ అధికారి, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027